ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

బుధవారం 16 జూలై 2025



పర్చూరు మండలం అడుసుమల్లిలో పెసల సేకరణ (ఫైల్‌ఫొటో)



చీరాల మున్సిపల్ కార్యాలయం

రేసులో.. ఆ ఇద్దరు

చీరాల మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ ఖాతాలో పడడం దాదాపు ఖాయమే...అది కూడా ఏకగ్రీవంగానే...ఇక మిగిలిందల్లా ఆ అదృష్టం ఎవరిని వరించనుందోననే ఉత్కంఠ మాత్రమే...దీనికి కూడా మరికొన్ని గంటల్లో తెరపడనుంది. అవిశ్వాసంతో చైర్మన్ జంజనం శ్రీనివాసరావును గద్దె దింపడం మొదలుకుని ఎన్నో మలుపులు తిరిగిన చీరాల మున్సిపల్ చైర్మన్ అంకం తుది ఘట్టానికి చేరింది. చైర్మన్ ఎన్నిక బుధవారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఉదయం 11 గంటలకు చైర్ పర్సన్ ఎన్నిక, మధ్యాహ్నం 12 గంటలకు వైస్ చైర్ పర్సన్ ఎన్నిక జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. చైర్మన్ పదవి కోసం పలువురు పోటీ పడినా తుది రేసులో ఇద్దరు మాత్రమే మిగిలినట్లు సమాచారం.

- చీరాల మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేడే
- మించాల, పొత్తూరు..లో ఒకరు?
- అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అంటున్న ఎమ్మెల్యే
- ఉత్కంఠకు తెరదించనున్న ఇన్‌చార్జి మంత్రి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అధిష్ఠానం నిర్ణయం మేరకు చైర్మన్ అభ్యర్థి పేరును ప్రకటించడానికి బుధవారం ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి చీరాల రానున్నారు. ఎన్నిక అంకానికి గంట ముందు పేరును ప్రకటించడంతో పాటు అధిష్ఠానం మనోగతాన్ని కూడా కౌన్సిలర్లకు మంత్రి వివరించనున్నారు. కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, పొత్తూరు సుబ్బయ్యలు మాత్రమే తుది రేసులో ఉన్నట్లు సమాచారం. ఇద్దరిలో సుబ్బయ్య ఎన్నికలకు ముందే వచ్చి కండువా కప్పుకుని పార్టీ గెలుపు కోసం కృషి చేయగా, చైర్మన్‌పై అవిశ్వాసం మొదలు తాజా పరిణామాల వరకు ఆర్థిక పరమైన అండదండలందించడంలో మించాల ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతో తుది రేసులో వీరిద్దరూ ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు మరో ఇద్దరు చైర్మన్ గిరీ కోసం పోటీ పడినా బరిలో నిలవలేక పోయారు

దాదాపుగా ఏకగ్రీవమే...

అధిష్ఠానం ఎవరి పేరును ప్రకటించినా మద్దతు ఇవ్వాల్సిందేనని సంకేతాన్ని ఇప్పటికే ఎమ్మెల్యే కొండయ్య పంపారు. అంకెల లెక్కలు కూడా టీడీపీకి పూర్తి అనుకూలంగా ఉండడంతో చైర్మన్ ఎన్నిక దాదాపుగా ఏకగ్రీవం అయ్యే సూచనలే కనబడుతున్నాయి. ఒక వేళ ఎన్నిక జరిగినా మొత్తం 33 మంది కౌన్సిలర్లలో టీడీపీకి ప్రస్తుతం 21 మంది మద్దతు ఉంది. వీరికి అదనంగా ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు కూడా ఉండడంతో గెలుపు నల్లేరు

(తరువాయి 4లో..)

మద్దతు.. మమ

- దిగుబడులు కొండంత
- మార్క్‌ఫెడ్ సేకరించింది గోరంత
- బహిరంగ మార్కెట్ వైపే రైతుల మొగ్గు
- మొక్కజొన్న కొనుగోళ్ల ఊసేలేదు
- జొన్న, శనగ విషయంలో తెరవని ఖాతా

దిగబడుల చూస్తే లక్షల టన్నుల్లో...కానీ మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ సేకరించింది చూస్తే వేల టన్నులకే పరిమితం. బహిరంగ మార్కెట్‌లో ధర ఏమన్నా అధికంగా ఉందా అంటే అదీ లేదు. మద్దతు ధర కన్నా తక్కువగానే ఉంటూ వచ్చింది. జొన్న, పెసలు, మినుములు, శనగ, కందులు వీటి సేకరణ కోసం మార్చి మూడో వారం నుంచే మార్క్‌ఫెడ్ జిల్లా వ్యాప్తంగా 62 కొనుగోలు కేంద్రాలను తెరిచిన సంగతి తెలిసిందే. దాదాపు మూడు నెలల పాటు జిల్లాలో కొనుగోళ్లు సాగాయి. జూన్ రెండో వారంలో కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. దిగుబడుల్లో దాదాపు 75 శాతం బహిరంగ మార్కెట్‌కే తరలిపోయినట్లు మార్క్‌ఫెడ్ సేకరించిన గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మార్క్‌ఫెడ్ అనుమతి ఇచ్చిన పంటల సంగతే ఇలా ఉంటే జిల్లాలో గణనీయంగా దిగబడులు ఉన్న మొక్కజొన్న విషయంలో మార్క్‌ఫెడ్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సేకరణ అంకం ముగించారు. వేలల్లో రైతాంగం ఉంటే కేవలం 658 మంది రైతుల వద్ద నుంచి 1094 మెట్రిక్ టన్నుల దిగుబడులను మాత్రమే మార్క్‌ఫెడ్ సేకరించగలిగింది. మద్దతుధర అలంకారప్రాయమే తప్ప అన్నదాతలకు ఉపయోగపడడమే లేదనేది సేకరణ లెక్కలు చెబుతున్నాయి. దిగుబడులకు, మార్క్‌ఫెడ్ సేకరణకు మధ్య భారీ తేడా ఉండడం వెనక గత ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ప్రస్తుతం వ్యవస్థల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా కనబడుతోంది

జిల్లాలో దిగుబడుల అంచనా ఇలా...

పెసల దిగుబడి జిల్లా వ్యాప్తంగా 8,000 టన్నుల వరకు ఉండొచ్చనేది వ్యవసాయశాఖ లెక్కకట్టింది. దీనికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 8,682గా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.800 వరకు తక్కువగానే నడిచింది. సేకరణ లక్ష్యాన్ని 3,500 టన్నులుగా మార్క్‌ఫెడ్ నిర్దేశించుకోగా 913 టన్నులతో సరిపెట్టారు. అదే విధంగా కందికి మద్దతుధర 7,550గా ఉండగా జిల్లాలో సాగు పరిమితంగానే ఉండడంతో 190 టన్నుల లక్ష్యాన్నే విధించుకున్నారు. ఇది కూడా 143 టన్నుల వద్దే మార్క్‌ఫెడ్ ఆగిపోయింది. మినుములు జిల్లాలో దాదాపు 25,000 టన్నుల వరకు దిగుబడులు ఉంటాయనే అంచనాలు ఉండగా సేకరించింది అతి స్వల్పంగా 37 టన్నులకే పరిమితమైంది. ఇక శనగ, జొన్న విషయంలో అయితే మార్క్‌ఫెడ్ ఖాతానే తెరవలేదు.

658 మంది దగ్గరే కొనుగోళ్లు

జిల్లా వ్యాప్తంగా 2,158 మంది రైతులు తమ ఉత్పత్తులను మార్క్‌ఫెడ్‌కు అమ్ముకోవడానికి రిజిష్టర్ చేసుకుంటే ముగింపు కొచ్చేసరికి ఈ సంఖ్య 658 మంది రైతుల వద్దే ఆగిపోయింది. కంది, మినుములు, పెసలును మాత్రమే మార్క్‌ఫెడ్ మద్దతు ధరకు రైతుల వద్ద నుంచి సేకరించగలిగింది. అది కూడా మొత్తం 1094 టన్నులకే పరిమితమవడం విస్మయపరిచేదిలా ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే జిల్లాలో మొక్కజొన్న దాదాపు 24,000 హెక్టార్లలో సాగయింది. దీనిని మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించాలనే డిమాండ్లు రైతుల వద్ద నుంచి పెద్ద ఎత్తున

(తరువాయి 4లో..)

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుకర్‌గుప్తా, పక్కన నీలంసాహ్ని



స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి

- రాష్ట్రాల ఎన్నికల కమిషనర్స్ చైర్మన్ డాక్టర్ మధుకర్‌గుప్తా

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్స్ చైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ మధుకర్‌గుప్తా తెలిపారు. జిల్లాలో స్థానిక ఎన్నికల నిర్వాహణకు సంబంధించి అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పంచాయతీరాజ్ చట్ట ప్రకారం ఎన్నికల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డీలిమిటేషన్, రిజర్వేషన్ అమలు పరిశీలించాలని, ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. రాజకీయంగా ప్రభావితం చేసే అంశాలను ముందస్తుగా గుర్తించాలన్నారు. గత ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకొని రాజకీయ ఒత్తిడి లేకుండా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

బాధ్యతతో వ్యవహరించాలి : ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని

అధికారులు బాధ్యతతో ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని తెలిపారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలోను 50శాతం మహిళలకు రిజర్వేషన్ అమలు చేశామని డీఆర్వో గంగాధర్‌గౌడ్ తెలిపారు. సమావేశంలో డీపీవో ప్రభాకరరావు, గుంటూరు, ప్రకాశం జడ్పీ సీఈవోలు జ్యోతిబసు, చిరంజీవి, ఆర్డీవో పి.గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలి

- వర్క్‌షాపులో కమిషనర్ రఘునాథరెడ్డి సూచన

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారానే చెత్తను వేరు చేయడం, చెత్త నిర్వహణ సాధ్యమౌతుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె, పొన్నూరు పురపాలక సంఘాల కమిషనర్లు, ఇంజనీర్లు, ప్రజాఆరోగ్య సిబ్బందికి వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి, హానికర వ్యర్థాలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన ద్వారా సత్ఫలితాలు సాధిస్తామన్నారు. చీరాల కమిషనర్ అబ్దుల్ రషీద్, పొన్నూరు కమిషనర్ ఎం.రమేష్‌బాబు, రేపల్లె కమిషనర్ కె.సాంబశివరావు వారి పురపాలక సంఘాల్లో జరుగుతున్న చెత్త సేకరణ, విభజన గురించి వివరించారు. వర్క్‌షాపులో అకాడమీ ఆఫ్ గాంధీ అండ్ స్టడీస్‌కు చెందిన గోపాలకృష్ణమూర్తి, ఏజీఎస్ ప్రతినిధి యు.ఉమామహేశ్వరి, ఎఫర్ట్ ఎన్జీవో ప్రతినిధి యు.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

రోడ్ల ఆక్రమణ.. వ్యాపారం

- ట్రాఫిక్ జాంతో పాటు ప్రమాదాలు

చెరుకుపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత మండలాలకు రవాణా కేంద్రంగా ఉన్న చెరుకుపల్లిలో ప్రధాన రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. వాహనాలు తిరిగేందుకు వీలు లేకుండా రోడ్లపైనే వ్యాపారులు చేసుకుంటున్నారు. చెరుకుపల్లి నుంచి వెళ్లే 216 జాతీయరహదారిని కూడా ఆక్రమణదారులు వదల్లేదు. పొన్నపల్లిలోని మేరీరోజ్‌బడ్స్ స్కూల్ నుంచి ఆరుంబాక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వరకు ఇరువైపులా సగం రోడ్డు తోపుడు బళ్లతో నిండిపోయింది. దీంతో ఈ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ జాంతో పాటు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గుళ్లపల్లి కోటిసెంటర్, అంబేద్కర్ సెంటర్‌లో పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లోని వ్యాపారులు రోడ్డు మార్జిన్ల ఆక్రమించి సైన్‌బోర్డులు, క్యాష్‌కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. గతనెలలో ఒక్కరోజులోనే నాలుగు ప్రమాదాలు చోటుచేసుకోగా వ్యాపారులను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. అయినా 15 రోజులుగా పట్టించుకున్న వారే లేరు.



అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డు ఆక్రమించి వ్యాపారం..



వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో..



చెరుకుపల్లి మెయిన్‌సెంటర్‌లో..

సీఎస్ఈ.. కావాలి





- సాఫ్ట్‌వేర్ బ్రాంచీలకే డిమాండ్
- కంప్యూటర్ సైన్స్‌లో పది ఉప బ్రాంచీల ఏర్పాటు
- వెబ్ కౌన్సెలింగ్‌లో ఎక్కువ మంది విద్యార్థుల ఆసక్తి
- సివిల్, మెకానికల్ బ్రాంచీలను ఎత్తేసిన సగం కాలేజీలు

గుంటూరు(విద్య), జూలై 15 (ఆంధ్ర జ్యోతి): బీటెక్ అంటే నేటి తరం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో సాఫ్ట్‌వేర్ సంబంధిత కంప్యూటర్ సైన్స్(సీఎస్సీ) ఒక్కటే అనే భావం నెలకొంది. పెద్ద యూనివర్సిటీల నుంచి సాధారణ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎక్కడైనా విద్యార్థులు సీఎస్సీ లేదంటే ఆ పేరుతో ఏర్పాటు చేస్తోన్న ఉప బ్రాంచ్‌లపైనే నూటికి 90 శాతం మంది ఆసక్తి చూపుతున్నారు. మూడు రోజుల నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ జరుగుతోంది. ఆదివారం నుంచి విద్యార్థులు కోర్సులు, కళాశాలలకు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఏఈపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల్లో అత్యధికమంది సీఎస్ఈ లేదంటే దాని ఉప బ్రాంచ్‌ల్లో చేరేందుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గుంటూరు జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర జిల్లాల విద్యార్థులు భారీ సంఖ్యలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈఏపీ సెట్‌లో 25 వేల మంది విద్యార్థులు అర్హత సాధించగా 30 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నా యి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులతో పూర్తిస్థాయిలో ఇంజనీ రింగ్ కళాశాలలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని ప్రిన్సిపాల్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాగార్జున యూని వర్సిటీ(గుంటూరు), జేఎన్‌టీయూకే(నరసరా వుపేట) క్యాంపస్‌లతో పాటు 36 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. గతంలో ఆయా కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్ మెకానికల్, కెమికల్ ఇంజనీ రింగ్ తదితర బ్రాంచీలు ప్రధానంగా ఉండేవి. అయితే నాలుగైదేళ్ల నుంచి సీఎస్సీలో వచ్చిన సబ్ బ్రాంచీల కారణంగా సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఒక్క సీఎస్సీలోనే దాదాపు పది ఉప బ్రాంచీలు ఉన్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో సీఎస్సీలో రెండు బ్రాంచ్‌లు

(మిగతా 4లో)

6

విసిరితే.. వికసిస్తాయి!

- విత్తన బంతులతో పర్యావరణ పరిరక్షణ
- విద్యార్థుల్లో ప్రేరణకు విశ్రాంత అధ్యాపకుడి కృషి

హాస్టల్ వార్డెన్‌కు తల్లిదండ్రుల దేహశుద్ధి 4

యూట్యూబ్‌లో చూసి బుల్లెట్ల మాయం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్‌లు

- వ్యసనాలతో ఇంజనీరింగ్ విద్యార్థులు చోరీల బాట
- ఏడుగురి ముఠా అరెస్టు.. 16 బుల్లెట్లు, ఒక స్కూటీ స్వాధీనం

అద్దంకి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వారంతా ఇంజనీరింగ్ విద్యార్థులు. వ్యసనాలకులోనై చోరీల బాటపట్టారు. హ్యాండిల్ లాక్ ఎలా తీయాలి, ఎలా స్టార్ట్ చేయాలని యూట్యూబ్ ద్వారా తెలుసుకుని బుల్లెట్లను అపహరిస్తున్న ఏడుగురు విద్యార్థుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట పోలీసులు హాజరు పరిచారు. ఇందుకు సంబంధించి చీరాల డీఎస్పీ మొయిన్ వెల్లడించిన వివరాలు.. ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన వల్లా సాయిరాం, జరుగుమల్లి మండలం యడ్లూరిపాడుకు చెందిన దివి వేణుగోపాల్, కొత్తపట్నం మండలం ఆలూరుకు చెందిన అక్కల వెంకటసాయిరెడ్డి, దర్శి మండలం తూర్పు వీరాయపాలేనికి చెందిన రాయపూడి వసంతకుమార్, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం నార్లగెడ్డ గోవిందరాజు, నెల్లూరు జిల్లా కావలి మండలం చౌదరిపాలేనికి చెందిన కోడెల పవన్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలం కొత్తపెండ్యాలకు చెందిన జీనేపల్లి నరేంద్రవర్మ ఒంగోలులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ఒంగోలులోని వీఐపీ రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక సమీపంలో ఉండే వీరంతా వ్యసనాలకు లోనయ్యారు. ద్విచక్ర వాహనాలను అపహరించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో యూట్యూబ్‌లో బుల్లెట్ అపహరణ గురించి తెలుసుకున్న గోవిందరాజు స్నేహితులకు వివరించాడు. తొలుత కొటప్పకొండ తిరునాళ్లలో బుల్లెట్ వాహనాన్ని దొంగిలించారు. ఆ తర్వాత వరుసగా సింగరకొండ తిరునాళ్లలో, అద్దంకి, కాకానిపాలెం, దామావారిపాలెం, చిలకలూరిపేట, నరసరరావుపేట, మద్దిపాడు, మేదరమెట్ల ప్రాంతల్లో బుల్లెట్లు, జె.పంగులూరులో స్కూటీని దొంగలించారు. వీటిలో కొన్ని వినియోగించుకుంటూ, మిగిలినవి అద్దంకిలోని బ్రహ్మానందం కాలనీలోని పాడుబడిన భవనంలో దాచిపెట్టారు. వరుస దొంగతనాలపై అద్దంకి టౌన్ సీఐ సుబ్బారాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలిస్తుండగా దొంగల ముఠాను అరెస్టు చేసి, 16 బుల్లెట్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ సుబ్బారావు, ఏఎస్ఐ వసంతరావు, హెడ్ కానిస్టేబుల్ అంకమ్మరావు, సిబ్బంది వి.బ్రహ్మయ్య, పి.బ్రహ్మయ్య, వెంకటగోపయ్యలను ఎస్పీ తుషార్‌డూడీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

కార్గిల్ అమర జవాను సేవలకు గుర్తింపు

● సేవా మెడల్‌తో కుటుంబ సభ్యులకు సన్మానం


జవాను కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రం అందజేత

పిట్టలవానిపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ అమర వీరుడు, జవాను మహ్మద్ హాజీ బాషా కుటుంబ సభ్యులను ఆర్మీ అధికారులు మంగళవారం సన్మానించారు. కార్గిల్ ప్రాంతంలో 8 మౌంటెన్ డివిజనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఆర్మీ ప్రతినిధులు చందోలు గ్రామంలోని హాజీ బాషా నివాసానికి చేరుకున్నారు. కార్గిల్ యుద్ధంలో హాజీ బాషా సాహసానికి గుర్తింపుగా కేంద్రం సేవా మెడల్ ప్రదానం చేసింది. ఇందుకు సంబంధించిన ప్రశంసా పత్రం, మెమెంటోను ఆర్మీ అధికారులు హాజీ బాషా కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం అమర జవాను చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ.. 1990లో జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం హాజీ బాషా తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. సంక్షేమ సంఘం తరుపున ఆర్మీ అధికారులకు ఈ సందర్భంగా స్వాగతం పలికారు. కార్గిల్ నుంచి విచ్చేసిన ఆర్మీ అధికారి ఎం.వెంకటరెడ్డి హాజీబాషా సేవలను కొనియాడారు. హవల్దార్ మేజర్ రాజేష్, కేకే హవల్దార్ చిరంజీవు బృందం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌కు తల్లిదండ్రుల దేహశుద్ధి

● విద్యార్థినుల పట్ల వ్యవహారశైలిపై ఆగ్రహం


వార్డెన్ సౌరిబాయిని చితకబాదుతున్న తల్లిదండ్రులు

కారంపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఆదర్శ పాఠశాల వసతి గృహ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తోందని తల్లిదండ్రులు మంగళవారం వార్డెన్ సౌరిబాయిని చితకబాదారు. ఆమె విద్యార్థినులకు యూ టూబ్‌లో బూతు బొమ్మలు చూపిస్తోందని ఆరోపించారు. విద్యార్థినులను బయటకు తీసుకెళ్లడమే కాకుండా.. బయట వ్యక్తులను లోపలికి తీసుకొస్తోందని, తను చెప్పింది చేయాల్సిందేనని హాస్టల్ విద్యార్థినులను బెదిరిస్తోందని తల్లిదండ్రులు వాపోయారు. అంతేకాకుండా వార్డెన్ సౌరిబాయి విద్యార్థినులు స్నానాలు చేసేటప్పుడు ఫొటోలు కూడా తీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఆమె వ్యవహార శైలిపై ప్రిన్సిపల్ నయోమికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. సౌరిబాయిపై గతంలో పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. పాఠశాలలో సీటు వచ్చినా.. తమ పిల్లలను హాస్టల్‌లో చేర్చాలంటే భయమేస్తోందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మోడల్ స్కూల్ నుంచి సాయంత్రం విద్యార్థినులను బయటకు పంపే సమయంలో యువత బైకులపై చక్కర్లు గొడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నా.. స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

23 నుంచి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), జూలై 15(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో ఈ నెల 23, 24 తేదీల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నట్లు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీ నారాయణ తెలిపారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. ఏడేళ్లుగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు లేకపోవడంతో కార్మికులకు జరుగుతున్న నష్టం, భవిష్యత్తు ప్రణాళికను ఈ మహా సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వందలాది కార్మికులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మహా సభలకు ఆహ్వాన సంఘం చైర్మన్‌గా నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, వైస్ చైర్మన్‌గా నారెట్కో అధ్యక్షుడు పెరవలి నాగవంశీ, సహాయ కార్యదర్శిగా ప్రముఖ ఆర్కిటెక్ కె.ఎస్ కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. సభలకు బిల్డర్లు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, డి.కోటేశ్వరరావు, దీవెనరావు, వలీ, సీతారామయ్య, నికల్సన్, అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు మెరుగు పరచుకోవాలి

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హెని క్రిస్టినా

గుంటూరు సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు ఎన్నికైన మహిళా ప్రజా ప్రతిని. దులు నాయకత్వ లక్షణాలు మెరుగు పరచుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా సూచించారు. మహిళా నాయ కత్వంలో మార్పు - స్థానిక స్వపరిపాలనలో సాధికారత అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె జడ్పీ కార్యాలయంలో ప్రారంభించి, ప్రసంగించారు. మహిళ నాయకత్వంలోని ఆలోచనల మార్పు ద్వారా స్థానిక పాలనలో స్వపరిపాలన సాధ్యం అని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీ ఎన్ సాయి కుమార్ మాట్లాడుతూ మహిళా జడ్పీటీసీలు, ఎంపీపీలను పాలన వ్యవహారాల్లో మరింత బలోపేతం చేసేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామని చెప్పారు.

రెండు నిమిషాల హాల్ట్.. సరిపోవడం లేదు

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం సాయంత్రం వేళ విజయవాడ నుంచి బయలుదేరి గుంటూరు మీదగా లింగంపల్లికి వెళ్లే 12795 ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌పై ప్రయాణికుల నుంచి రైల్వే ఉన్నతాధికారులకు తరచుగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఈ రైలుకు గుంటూరులో కేవలం రెండు నిమిషాల సమయం మాత్రమే హాల్టింగ్ ఉంది. సాయంత్రం 6.15 గంటలకు వచ్చి 6.17కి ఈ రైలు బయలుదేరుతుంది. ఈ రైలుకు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ రైలు తర్వాత రాత్రి 11.15 గంటల సమయం దాటేంత వరకు మరో రైలు లేదు. దీంతో ఎక్కువ మంది ఇంటర్ సిటీలో ప్రయాణిస్తున్నారు. గుంటూరులో ఇచ్చిన రెండు నిమిషాల హాల్టింగ్ సమయం ప్రయాణికులు ఆ రైలులో బోర్డింగ్ చేయడానికి సరిపోవడం లేదు. దీంతో రైలు ఎక్కలేక పలువురు వెనుదిరుగుతున్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో హాల్టింగ్ సమయం కనీసం ఐదు నిమిషాలకు పెంచేందుకు తాము ఉన్నతాధికారులకు నివేదిస్తామని కంట్రోల్ ఆఫీసు అధికారులు పేర్కొన్నారు.

విశ్రాంత రైల్వే గార్డు నకిలీ టీటీఈ అవతారం

● రైలు బోగీల్లో తనిఖీ చేస్తూ పట్టుబడిన వైనం..

నర్సరావుపేట లీగల్, జులై 15,(ఆంధ్రజ్యోతి): నకిలీ టీటీఈని నరసరావుపేట రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఈ నకిలీ టీటీఈ.. గుంటూరుకి చెందిన అసలు టీటీఈ జాన్ వెస్లీకి తారసపడ్డాడు. నకిలీ టీటీఈని గుర్తింపు కార్డు చూపాలని జాన్ వెస్లీ కోరగా.. వాదనకు దిగాడు. రైలు నరసరావుపేటకి రాగానే బయటకు దూకి పరారయ్యేందుకు యత్నించాడు. అప్పటికే.. అప్రమత్తమైన నరసరావుపేట రైల్వే పోలీసులు నకిలీ టీటీఈని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని రోజులుగా టీటీఈగా చెలామణి అవుతూ.. రైళ్లలో తిరుగుతున్న అతన్ని.. అవినాష్ కృష్ణ గుప్తాగా రైల్వే పోలీసులు గుర్తించారు. అతను.. గతంలో బిలాస్ పూర్ పరిధిలో రైల్వే గార్డుగా పనిచేసి.. ప్రమాదం బారిన పడటంతో ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయ్యాడని గుర్తించారు.

సీఎస్ఈ.. కావాలి

(3వ పేజీ తరువాయి)

మాత్రమే ఉండగా ప్రస్తుతం ఏఐఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇలా ఉప దాదాపు పది బ్రాంచ్‌లను ఏర్పాటు చేశారు. 36 కాలేజీల్లో సగం కాలేజీల్లో సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో సీట్లు భర్తీ కావడం లేదు. దీంతో క్రమంగా కళాశాలలు వీటిని ఎత్తివేసి కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన బ్రాంచ్‌లను ప్రవేశపెడు తున్నాయి.

భారీ ప్యాకేజీల మోజుతో..

ఇంజనీరింగ్‌లో సీఎస్సీ, ఐటీ బ్రాంచ్‌ల్లో అత్యధికంగా విద్యార్థులు చేరడానికి కారణం భారీ ప్యాకేజీలే కారణమని అధ్యాపకులు చెబుతున్నారు. సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ప్రారంభ జీతం రూ.15 వేల నుంచి 25 వేల లోపు ఉంటే కంప్యూటర్ బ్రాంచీల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.75 వేల వరకు ప్రారంభ జీతం ఉంటోంది. దీనికి తోడు వైట్ కలర్ ఉద్యోగుల మాదిరి ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయవచ్చు. దీనికి తోడు ఉద్యోగులకు ఆయా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఫలితంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించే బ్రాంచీల వైపే విద్యార్థులు మొగ్గ చూపుతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉపాధి అవకాశాలు ఉన్నా...

తొలుత బీటెక్‌లో మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే ఉండేవి. కంప్యూటర్ కోర్సు రావడం.. గత కొన్నేళ్లుగా విద్యార్థుల్లో నెలకొన్న పరిణామాలతో మెకానికల్, సివిల్, కెమికల్ బ్రాంచీల్లో నిరాదరణకు గురయ్యాయి. ప్రధానంగా ఆయా బ్రాంచీల్లో డిగ్రీలు చేస్తే ఉపాధి కష్టమన్న భావన విద్యార్థుల్లో నెలకొందని కళాశాలల ప్రిన్సిపాల్స్ చెప్తున్నారు. కానీ ఇది వాస్తవం కాదంటున్నారు. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు నిర్మాణ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయి. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ప్లాంట్లలో అత్యధిక గంటలు నిల్చొని పనులు చేయాల్సి ఉంటుంది. ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయడానికి అవకాశాలు చాలా తక్కువ కావడంతో ఈ బ్రాంచ్‌లకు విద్యార్థుల నుంచి డిమాండ్ తగ్గింది.

ఓర్వలేక వైసీపీ నేతలు.. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్


కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఏడాది పాలన చూసి ఓర్వలేక.. ఇక భవిష్యత్‌లో అధికారంలోకి రాలేమని భావించిన వైసీపీ నేతలు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓదార్పు యాత్రలు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కొత్తకాదని తెలిపారు. ఏదో రకంగా ప్రభుత్వాన్ని రెచ్చగొట్టి తప్పుడు కేసులు పెట్టించుకొని సానుభూతి పొందాలని చూస్తున్నారని అన్నారు. వైసీపీ హయాంలో రాజధాని అమరావతిని పూర్తిగా అడవిగా మార్చారని, వైసీపీ పాడు చేసి వెళ్లిన రాజధానిని నేడు బాగుచేసుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు అవాకులు చవాకులు తగ్గించుకుంటే మంచిదని హితవు పలికారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి చెందిన రాజధానిని చూడబోతున్నామన్నారు.

తురకా కిశోర్‌కు రిమాండ్


మాచర్ల కోర్టు వద్ద తురకా కిశోర్

మాచర్ల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు తురకా కిశోర్‌కు హత్యాయత్నం కేసులో మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగళవారం 14 రోజుల రిమాండ్ విధించింది. 2022 అక్టోబరు 7వ తేదీన వెల్దుర్తి మండలం బోదలవీడుకు చెందిన టీడీపీ నాయకుడు దారపనేని శ్రీనివాసరావును వైసీపీ పార్టీలోకి మారాలని దాడి చేశారనే కేసులో కిశోర్‌పై వెల్దుర్తి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇప్పటికే కారంపూడి కేసులో గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కిశోర్‌పై వెల్దుర్తి పోలీసులు పీటీ వారంట్ కింద మాచర్ల కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్ ఈ మేరకు రిమాండ్ విధించారు. వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి ఎస్కార్ట్‌తో గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

మద్దతు.. మమ

(3వ పేజీ తరువాయి)

వచ్చాయి. ఈ పంట మార్క్‌ఫెడ్ జాబితాలో ఉంది కూడా. కానీ మద్దతుధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో మొత్తం దిగుబడులను రైతులు దళారులకే అమ్ముకోవాల్సి వచ్చింది

వైఫల్యాలపై దృష్టి పెట్టని ప్రభుత్వం

పంటల సేకరణ మరీ ఇంతలా తీసికట్టుగా ఉండడానికి అనేక బాలారిష్టాలు కారణంగా ఉన్నాయి. ముఖ్యంగా దిగుబడులు అన్నదతాల చేతికొచ్చిన మూడు వారాల తర్వాత గానీ మార్క్‌ఫెడ్ కేంద్రాలు తెరవలేదు. దీనికి తోడు మార్క్‌ఫెడ్ వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చడంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాల ఊసే దాదాపుగా మరిచారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం వైఫల్యం కూడా కారణంగా నిలిచింది. నిబంధనల చట్రం కూడా సేకరణకు ప్రతిబంధకంగా మారింది.

బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువ....ఉత్తమాటే...

బహిరంగ మార్కెట్‌లో ఆయా పంటల ధరలు మద్దతు ధరకన్నా ఎక్కువగా ఉండడం వల్లనే సేకరణ తక్కువగా ఉందనే వాదనను యంత్రాంగం చేస్తోంది. కానీ దిగుబడుల సమయంలో క్షేత్రస్థాయిలో ఉన్న ధరలను గమనించినట్లయితే ప్రతి పంట రేటు కూడా మద్దతుధర కన్నా బహిరంగ మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.800 వరకు తక్కువగానే ఉంది.

నగదు జమ విషయంలోనూ జాప్యమే

పంటల కొనుగోళ్లకు సంబంధించిన నగదును 48 గంటల్లోనే జమ చేస్తామనే పాలకుల మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. మార్క్‌ఫెడ్ సేకరణ జరిపిన పంటల విషయంలో కూడా కనీసం నాలుగు వారాలు మొదలుకుని నెలన్నర వరకు సమయం డబ్బులు జమ కావడానికి పట్టినట్లు సమాచారం.

రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగించే వారికి అంబేడ్కర్ దేవుడు

● జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామ్‌చందర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వడ్డేపల్లి రామ్‌చందర్

తాడేపల్లి (ఉండవల్లి) , జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించే ప్రతి వ్యక్తికి అంబేడ్కర్ దేవుడే అని జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామ్‌చందర్ అన్నారు. మంగళవారం ఉండవల్లిలోని అంబేడ్కర్ సంస్థానంకు ఆయన విచ్చేశారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్‌చందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 338 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు వర్తించాల్సిన అన్ని వనరులు, ఉద్యోగాలకు సంబంధించి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పర్యటించామని తెలిపారు. పలు సమస్యలపై సమీక్ష చేసినట్లు చెప్పారు. ఉండవల్లి గుడిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలరాతి విగ్రహాన్ని సందర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో పోలీసులకు సూచనలు చేయడం జరిగిందన్నారు. 2018 నుంచి గవర్నమెంట్ గెజిట్ ప్రకారం అట్రాసిటీ కేసులలో అరెస్టులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోతే పోలీసులపై ఎస్సీ కమిషన్ యాక్షన్ తీసుకుంటుందన్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన దాడిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కానీ ఈ కేసును సుమోటాగా తీసుకోవడం జరిగిందన్నారు. పలువురు బుద్ధిస్టులు, అంబేడ్కర్ వాదులు ఈ సందర్భంగా రామ్‌చందర్‌ను ఘనంగా సత్కరించారు.

సమస్యల వెల్లువ..!

● విద్యుత్ అదాలత్‌కు పోటెత్తిన వినియోగదారులు
● అధికారుల తీరుపై పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఆగ్రహం
● అర్జీల నమోదు తీరుపై వినియోగదారుల అసంతృప్తి


సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేలు

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు మంగళవారం బాపట్ల పట్టణంలోని శ్రీ సాయి ప్యాలెస్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేలు ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలు తీసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపించారు. అయితే.. కొన్ని అర్జీలు నమోదు చేయకపోవడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కర్లపాలెం మండలం నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఏఈ బాష, సిబ్బందిపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పట్టణంలోని పటేల్ నగర్‌కు చెందిన యు.శ్రీనివాసరావు సోలార్ విద్యుత్ బిల్లులు 2022 జనవరి నుంచి జూన్ వరకు రూ.13,600 చెల్లించారని.. ఆ తర్వాత ఇప్పటి వరకు మిగులు విద్యుత్‌కు బిల్లులు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు.

● పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌కు చెందిన శ్రీ జయలక్ష్మీ ఇండస్ట్రీకి సంబంధించి అధికారులు స్మార్ట్ బిగించారని అయితే దీనికి కెపాసిటర్ బ్యాంక్ పెట్టాలన్న విషయం చెప్పకపోవటంతో గతంలో నెలకు రూ.17 వేలు బిల్లు వచ్చేదని ప్రస్తుతం రూ. 48 వేలు వస్తుందని ఇండస్ట్రీ నిర్వాహకులు శంకర్ ఫిర్యాదు చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కెపాసిటర్ బ్యాంక్ పెట్టుకొమని ఇప్పుడు చెప్పడం వల్ల తాను లక్షలాది రూపాయలు నష్టపోతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల ఎస్ఈ జి.ఆంజనేయులు, ఈఈ జి.భాస్కరరావు, విద్యుత్ అదాలత్ సభ్యులు ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు, ఎ.సునీత, ఎస్.శ్రీనివాసరావు, ఏడీఈలు, ఏఈలు తది తరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ విద్యా సంస్థల సమన్వయకర్తకు.. శ్రీగురు పురస్కారం


గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్

గుంటూరు (విద్య)జూలై 15 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ విద్యాసంస్థల సమన్వయకర్త, ప్రముఖ ప్రవచకులు, సంస్కృత అధ్యాపకులు గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్‌కు మంగళవారం శ్రీ గురు పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం వారు సాహిత్య రంగంలో విశేష కృషి చేయడంతో పాటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, బ్రాహ్మణ ధర్మములను సంరక్షించి వ్యాప్తి గావించినందుకు గాను "రామాయణ ప్రవాచక కంఠీరవ" అనే బిరుదుతో సత్కరించారు. నేటి యువతకు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను మరింత చేరువయ్యేలా కృషి చేస్తానని వెల్లడించారు. శ్రీ గురు పురస్కారం పొందిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్‌ను విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు.

రేసులో.. ఆ ఇద్దరు!

(3వ పేజీ తరువాయి)

మీద నడకగానే ఉండనుంది

అంతా సవ్యంగానే కనిపించినా...

చీరాల రాజకీయం అంచనాలకు అందదనే సంఘటనలు గతంలోనే పలుమార్లు నిరూపితమైంది. తాజాగా చైర్మన్ అవిశ్వాస ఘట్టం కూడా ఎన్నో మలుపులు తీసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీడీపీకి మద్దతుగా ఉన్న 21 మంది కౌన్సిలర్లలో ఒక్కరు తప్ప అందరూ నిన్న మొన్నటి వరకు వైసీపీ గూటి పక్షులే. ఇప్పటికే 7 గురు కౌన్సిలర్లు వైసీపీలోనే ఉండగా, మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గంగా 5గురు కౌన్సిలర్లు కొనసాగుతున్నారు. జరుగుతున్న పరిణామాలను వీరు నిశితంగా గమనిస్తున్నారు. నేటి చైర్మన్ ఎన్నిక అంకంలో వీరిలో ఎవరైనా పోటీకి ముందుకు వస్తే ఎన్నిక అనివార్యమే. కాకుంటే సంఖ్యాబలంగా టీడీపీకి స్పష్టమైన మెజారిటీ కనిపిస్తుండడంతో ఎన్నిక జరిగినా పీఠం టీడీపీదేననే ధీమాను పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	98, 107, 118
చికెన్ విత్ స్కిన్(కిలో)	190.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	200.00

52,228 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,761 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 52,228 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,478 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13400	273	---	----
4884	----	---	341	10000	13500
సూపర్ 10	10000	13000	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13600	తేజ	10000	13500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4600	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

కల్తీ కల్లు, మద్యం ఆరోగ్యానికి హానికరం

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కల్తీకల్లు, నకిలీ మద్యం ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం కల్లుగీత కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లులో మత్తు పదార్థాలు వినియోగం, సరైన లైసెన్స్ లేకుండా కల్లు అమ్మటంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాలు నుండి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని కోరారు. నకిలీ మద్యం సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్కువ ధరకు నకిలీ మద్యం అమ్మేవారి వివరాలు తమకు తెలియజేయాలని టోల్‌ఫ్రీనెంబరు 14405కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ పి.గీతిక, ఎస్సై మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల భిక్షాటన

బాపట్ల,జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం పట్టణ వీధులలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు భిక్షాటన చేస్తూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. సీఐటీయూ నాయకుడు కె.శరత్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలన్నారు. ఇదేవిధమైన విధానం కొనసాగితే పట్టణంలో విద్యుత్, నీటిసరఫరా పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మెబాట వీడేదిలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రత్నం, నాని, అశోక్, మురళీకృష్ణ, హరిబాబు, స్వామిరెడ్డి, ప్రమీలా, నరేష్, వీరయ్య,షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి : సీపీఎం

బాపట్ల,జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సులో ఛైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేల్‌ను కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రజలపై భారం పెంచే స్మార్ట్ మీటర్లను, ట్రూ ఆఫ్ ఛార్జీలను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. వైసీపీ పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా విద్యుత్ భారం తగ్గకపోగా పెరుగుతుందన్నారు. దీనిపై స్పందించాలని లేకుంటే ప్రజల పక్షాన ఉద్యమం చేపడతామని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, సీపీఎం నాయకులు కె.శరత్, టి.సుభాషిణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ ధర్నా

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు ప్రవేశపెట్టిన పెన్షన్ మెడిటేషన్ అమెండెంట్ రద్దు చేయాలన్నారు. ఈ ఫైనాన్స్ బిల్లు అమలులోకి వస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్‌లకే కాక రాష్ట్రప్రభుత్వ పెన్షనర్‌లు కూడా నష్టపోయే అవకాశం ఉందన్నారు. దీనిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఎఫ్ ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవానీప్రసాద్, జిల్లా కోశాధికారి జీఎస్.ఆర్‌కె. ప్రసాద్, ఎం.పాపారావు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిసిన అర్చక సేవాసంఘం



కమిషనర్ రామచంద్రమోహన్‌కు పలు సమస్యలు తెలియజేస్తున్న బృందావనం గోపిచంద్ తదితరులు

పిట్టలవానిపాలె, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌ను జిల్లా అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ మంగళవారం కలిసి అర్చకుల సమస్యలు గురించి వివరించారు. అర్చకులకు ఆలయాలలో బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు, అర్చకుల ఈనామ్ భూములకు అనుభవదారులుగా పేరు నమోదు అవకాశం కల్పించి రైతులకు ఇచ్చే సంక్షేమ పథకాలు లాగా వారికి కూడా పలు పథకాలు వర్తింపు చేయాలని కోరారు. ఈ విషయమై సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గోపిచంద్ తెలిపారు. అర్చకులకు ధూప, దీప నైవేద్యం పథకం కింద నూతన లబ్ధిదారులను ప్రకటించినందుకు, వేదపండితులకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందించటానికి నిర్ణయం తీసుకోవటంపై రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బాపట్ల మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా కరిముల్లాఖాన్



కరిముల్లాఖాన్

కర్లపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా తనను నియమించినట్లు కరిముల్లాఖాన్‌ను తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆశీస్సులతో ఈ పదవి దక్కినందుకు సంతోషదాయకమన్నారు. ఆయన అధిష్ఠానానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు షేక్ బాజి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా పాల్గొన్నారు.

చింతాయపాలెం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా తిరుపతయ్య



తిరుపతయ్య

కర్లపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం చింతాయపాలెం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా తనను నియమించినట్లు మద్దిబోయిన తిరుపతయ్య(బుల్లయ్య) తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆశీస్సులతో ఈ పదవి రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీని నమ్ముకొని పనిచేసినందువల్లే ఈ పదవి దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మాడా శ్రీనివాసరావు, చీరాల శ్రీనివాసరెడ్డి, బాజి, పఠాన్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి పాలనాదక్షుడైన చంద్రబాబు అవసరం : కొల్లా

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉద్దేశించి మాజీ మంత్రి పేర్ని నాని 76 ఏళ్ళ వయసు వచ్చాయి. ఇంకెంతకాలం బతుకుతావు అని ప్రశ్నిస్తూ, పవన్‌కళ్యాణ్, లోకేశ్‌ల మీద అభ్యంతరకర ప్రేలాపనలు చేయటం వైసీపీ అరాచక విష సంస్కృతికి నిదర్శనమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం పరిపాలనదక్షుడైన చంద్రబాబునాయుడు సుదీర్ఘకాలం పాలించి జగన్ హయాంలో నాశనమైన రాష్ట్రానికి జవజీవాలు తెచ్చి యువత భవిష్యత్తును కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నట్లు అన్నారు.

వెల్డర్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖతార్ దేశంలోని వెల్డర్స్ ఉద్యోగావకాశాల కొరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ 24 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి ఐటీఐ, ఐటీసీ విద్యార్హత ఉండి నాలుగు సంవత్సరాల అనుభవం ఉన్నవారు అర్హులు అన్నారు. ఆసక్తి గలవారు అనుభవ సంబంధిత విద్య ధ్రువపత్రాలతో ఈనెల 31లోగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9988853335, 8978886348లో సంప్రదించాలన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

● రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం
● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు



సొసైటీ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన తిరుపతి వెంకయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు

కొల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : 2019-24 ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని, గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు సంవత్సర కాలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరు మండలం పెసర్లంకలో గాజుల్లంక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలకు మంగళవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెడుతూ గద్దెనెక్కిన జగన్ ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి జాడలు లేకుండా చేశాడని, 2014-19 కాలంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎన్నో విధాలుగా తీర్చిదిద్ది అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా మంచిపాలన అందించారన్నారు. పొత్తులో భాగంగా గాజుల్లంక పీఏసీఎస్‌ను జనసేనకు కేటాయించడం జరిగిందని, ఆ పార్టీ సూచించిన వారిని అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సహకార సంఘాల్లో కూడా వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులు ఆ సమయంలో జరిగిన అవినీతిని వెలికి తీయాలన్నారు. అనంతరం అధ్యక్షుడిగా గళ్లా తిరుపతి వెంకయ్య, సభ్యులుగా కోగంటి వెంకటరామారావు, సుగ్గున వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేసి మినిట్స్ బుక్‌లో సంతకాలు చేశారు. అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంకయ్యను ఎమ్మెల్యే, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పూల బొకేలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, ఎంపీటీసీ వెలివెల సుబ్రహ్మణ్యం, జీఎల్‌జీ భగవాన్, శిగిలిశెట్టి రాఘవరావు, వెలివెల బసవరత్తయ్య, ఏఎంసీ డైరెక్టర్ కుటుంబరావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లికి సారె సమర్పించిన భక్తులు

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల గ్రామదేవత శ్రీపోలేరమ్మతల్లికి ఆషాఢ మాసం సారె సమర్పించారు. పట్టణంలోని నరాలశెట్టిపాలేనికి చెందిన మహిళలు మంగళవారం పెద్దఎత్తున ఊరేగింపుతో, మేళతాళాలతో బయలుదేరి పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చి సారె సమర్పించారు. పోలేరమ్మతల్లికి సారె సమర్పించటం తమకెంతో సంతోషం కలిగిస్తుందని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మహిళలు పేర్కొన్నారు.



పోలేరమ్మతల్లికి ఆషాఢ మాసం సారె తీసుకెళుతున్న మహిళలు

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

వేమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలని మండల విద్యాశాఖాధికారిణి జ్యోతి తెలిపారు. వేమూరులోని ప్రత్యేక అవసరాల పాఠశాలలో విద్యార్థులకు వీల్ ఛైర్లు, వినికిడి యంత్రాలు వివిధ వస్తువులు మంగళవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, దుస్తులతో పాటు ప్రత్యేక పారితోషికాలు కూడా అందిస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం


బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదుళ్ళపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.జయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువతకు నైపుణ్య విద్యలో ప్రాధాన్యత, అవకాశాలు, శిక్షణ గురించి వివరించారు. నైపుణ్య విద్య ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సమగ్రశిక్ష ప్రోత్సహంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు.

ఆర్టీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాము

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవరకొండ రామును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు పత్తిపాటి చంద్రమోహన్ నియామక పత్రాన్ని అందజేశారు. నిజాయితీ, నిబద్ధతతో పని చేయాలని ఆయన సూచించారు. రామును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించటంపై పలువురు అభినందనలు తెలిపారు.

టెన్నిస్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో హైవెండ్ విద్యార్థుల ప్రతిభ

కర్లపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రెండో దక్షిణ జాతీయ టెన్నిస్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలలో కర్లపాలెంకు చెందిన హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని, జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. బాపట్లలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో 12, 13 తేదీలలో పలు రాష్ట్రాల క్రీడాకారులు క్రికెట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం జిల్లాకు గర్వకారణమని డీఈఓ అన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మంగళవారం మెమెంటోలు, సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వీరశేఖర్, ఛైర్మన్ పెదమల్లు ఉదయచంద్రరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ చాంధిని, ఆంజనేయప్రసాద్, వెంకటజ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



హైవెండ్ విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్‌లు అందజేస్తున్న డీఈవో శ్రీరామ్ పురుషోత్తం

మహిళల భద్రతకు శక్తియాప్ ఎంతో ఉపయోగకరం

బాపట్లరూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతకు శక్తియాప్ ఎంతోఉపయోగకరమని బాపట్ల హెడ్‌క్వార్టర్ శక్తిబృందం ఎస్ఐ అనిత అన్నారు. బాపట్ల మండలం కొండుభొట్లపాలెం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో శక్తియాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె, జూలై 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని డివిజన్ శక్తి టీమ్ ఇన్‌చార్జ్ నగరం ఎస్ఐ భార్గవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం పోక్సో చట్టం, సైబర్‌నేరాలు, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



ఆయిల్‌ఫామ్ సాగును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారులు

ఆయిల్ ఫామ్ సాగు పరిశీలన

కొల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కిష్కిందపాలెంలో నంబూరు గోపాలరావు సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం అజంతా సోయ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో బాపట్ల డీహెచ్‌వో హలీమ్, కొల్లూరు ఉద్యాన శాఖాధికారి కళ్యాణ చక్రవర్తి, సుధాకరరెడ్డిలు పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసి ఇది రెండో సంవత్సరమని, చెట్లు ఎదుగుదల ఆశాజనకంగా ఉందన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుకు అత్యధిక లాభాలు సాధించవచ్చని రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టి అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ బాషా, విహెచ్ఏ శిరీష, ఫీల్డ్ సూపర్‌వైజర్ బాలయ్య, రైతులు సురేష్ పాల్గొన్నారు.

వరిపంటకు ఇన్సూరెన్స్ చేసుకోండి : ఏడీఏ



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఏ కె.ధనరాజు, ఏవో కె.శారద

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి పంటకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఏడీఏ కె.ధనరాజు తెలిపారు. మండలంలోని వెదుళ్ళపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారిణి కె.శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ధనరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎకరానికి రూ.800 చెల్లిస్తే రూ.40 వేల వరకు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. రైతు సంబంధిత బ్యాంక్‌లకు వెళ్ళి పంట బీమా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంగడిపాలెం, రాజుకాల్వ గ్రామాల్లో...

రేపల్లె, జూలై 15(ఆంధ్రజ్యోతి) : పంటల బీమా పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.నవీన్ అన్నారు. గంగడిపాలెం, రాజుకాల్వ గ్రామాల్లో రైతుసేవాకేంద్రాల పరిధిలో వ్యవసాయ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి నారు పెంచే పద్ధతి గురించి ఆయన వివరించారు. ప్రతిరైతు ఈపంటనమోదు చేసుకోవాలన్నారు. వరినారుమడులు తయారీ పోషకలోపాల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు నవీన్, సతీష్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

యలవర్రులో...

అమృతలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వెద సాగు చేపట్టిన రైతులు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి హేమంత్‌భరత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని యలవర్రులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. హేమంత్ భరత్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులు తప్పని సరిగా కౌలు రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి డి మాధవి, వీఏఏలు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జంపని గ్రామంలో...

వేమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగు చేస్తున్న కౌలు రైతులు సీసీఆర్‌సి కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ తెలిపారు. పొలం బడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం జంపని గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొంది రైతు భరోసా పొందేందుకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రైతులతో ఖరీఫ్ సాగు గురించి వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకరాజు నల్లిబోయనవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో సత్యానంద్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు వరికి ఒక ఎకరాకు రూ.800చెల్లించి క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు సీహెచ్ సుదర్శనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు బాజి, మౌనిక, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలి



ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న వేమూరి రవికిరణ్, డాక్టర్ రామకృష్ణ దంపతులు

చెరుకుపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు దైవచింతనతో మెలిగితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని ఏపీఎన్ఆర్‌టీ ప్రెసిడెంట్ వేమూరి రవికిరణ్ అన్నారు. మండలంలోని కావూరు శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ శివాలయం విశిష్టత ఎంతో గొప్పదని, ఈ ఆలయాన్ని సందర్శించటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రవికిరణ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ తుమ్మలరామకృష్ణ, ఆలయ ట్రస్టీ కొయ్యలమూడి శ్రీనివాస్, ఈవో కావూరి శ్రీనివాస్, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రెండో వార్డులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్న అనగాని

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి

రేపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణాభివృద్ధి కోసం మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 2, 3 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికి తిరుగుతూ సంవత్సరకాలంలో టీడీపీ చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, డ్రెయిన్‌లు, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారన్నారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని లక్షలాది రూపాయలు వెచ్చించి కొత్తపైప్‌లైన్‌ల నిర్మాణం చేసి మెయిన్ కెనాల్ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా నీటిని తోడేందుకు వాటర్ పాయింట్ షెడ్డును శాశ్వతంగా ఏర్పాటు చేశామన్నారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని, నూతన పెన్షన్‌లకు ప్రభుత్వం త్వరలో అనుమతి ఇవ్వనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు దేవగిరి రవి, దేవగిరి రంగా, కొలుసుగౌరీ, దామెర్ల రమేష్, తాడిపర్తి మల్లికార్జునరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇసుకపల్లి సొసైటీ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

రేపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపల్లి సొసైటీ ద్వారా రైతులకు మేలు చేసే విధంగా తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఇసుకపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కనగాల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రిసోదరుడు అనగాని శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నిచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకపల్లి సొసైటీ పరిధిలోని రైతులకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సహాయ సహకారాలతో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఈపదవి ఇచ్చిన మంత్రి అనగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇసుకపల్లి సొసైటీ సభ్యులుగా శీలంరామ్‌ప్రసాద్, వుయ్యూరు శివనాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వీరమాచనేని నాని, నల్లూరు అజయ్‌కుమార్, జొన్నా రామస్వామి, గంగాధరరావు, జొన్నా వాసు, ఉప్పల వెంకట్రామయ్య పాల్గొన్నారు.



అనగాని శివప్రసాద్‌కు పుష్పగుచ్ఛాన్నిఅందించి కృతజ్ఞతలు తెలుపుతున్న కనగాల వెంకటేశ్వరరావు తదితరులు

సంవత్సర కాలంగా రాష్ట్రంలో సుపరిపాలన

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సర కాలంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని పెసర్లంకలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అమ్మకు వందనం పథకంతో 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు చెప్పారు. ఉచిత సిలిండర్ పథకాన్ని కూడా అమలు చేశామని, జూలై నెలలో రైతు సుఖీభవ కింద మొదటి విడత నగదు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేర్చడంతో పాటు ఐదేళ్లలో కుంటుపడిన అభివృద్ధిని కూడా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెసర్లంకలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

వేమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు రూ.7,09,034ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. చుండూరు మండలం మోదుకూరుకు చెందిన ఆళ్ల శ్రీనివాసరెడ్డికి రూ.2,70,208, మున్నంగివారిపాలేనికి చెందిన చీడే పూడి శ్రీనివాసరెడ్డికి రూ.30 వేలు, పోసన గోపయ్యకు రూ.43,914, కొల్లూరు మండలం ఈపూరులంకకు చెందిన కోగంటి ఉమామహేశ్వరరావుకు రూ.10 వేలు, భట్టిప్రోలుకు చెందిన అందె సాంబయ్యకు రూ.3,07,781, కన్నెగంటివారిపాలేనికి చెందిన బోపాటి నాగేశ్వరరావుకు రూ.1,18,881, కోనేటిపురంనకు చెందిన వానుగంటి జానకిరావుకు రూ.41,250 చెక్కులను పంపిణీ చేశారు. బాధిత కుటుంబాల వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

చుండూరు (అమృతలూరు) జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గత 13 సంవత్సరాలుగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నోట్ పుస్తకాలు ఉచితంగా అందిస్తున్న తన్నీరు చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. ఆలపాడు గ్రామంలోని యూపిస్కూల్‌లో తన్నీరు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శివశంకర్ మాట్లాడుతూ జన్మభూమి రుణం తీర్చుకోవడం కోసం గ్రామంలోని రెండు పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి గత పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి రూపశ్రీని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమ్మానుయేల్, పంచాయతీ కార్యదర్శి రఘురామరాజు, వీఆర్వో సుధాకర్, ట్రస్టు సభ్యులు తన్నీరు నాని, శ్రీనివాస్, నాగరాజు, చంద్రశేఖర్, గోపీకృష్ణ, బాలభాస్కరరావు, వెంకటరమణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



సీడ్ రోడ్డు పక్కన అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ కోసం ఏర్పాటు చేస్తున్న పైపులు

స్పీడందుకున్న.. రాజధాని నిర్మాణ పనులు

● సంవత్సరంలోనే అందుబాటులోకి ప్రధాన రహదారులు

తుళ్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనులు స్పీడందుకున్నాయి. సంవత్సరంలోనే ప్రధాన రహదారులు అందుబాటులోకి వస్తాయని టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు కంపెనీలు చెబుతున్నాయి. రాజధాని అమరావతి నగరం మాస్టర్ ప్లాన్ ప్రకారం 217 చదరపు కిలోమీటర్లుంటుంది. అందులో 360 కిలోమీటర్లు రహదారులుంటాయని సీఆర్డీఏ అధికారులు పేర్కొంటున్నారు. రైతుల ప్లాట్లలో రోడ్లు కాక ప్రధాన రహదారులు.. ఈస్ట్ నుంచి వెస్ట్ 16 రహదారులు .. నార్త్ నార్త్ నుంచి సౌత్‌కు 16 రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగు నీటి సరఫరా వర్షపు నీరు నిర్వహణ, విద్యుత్ కేబుల్ ఏర్పాట్లు రోడ్లు వెంబడి జరుగుతున్నాయి. రహదారుల కింద స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారికి బెటర్ ప్యాకేజీ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు రాజధాని నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని నిర్మాణానికి భుజం కలుపుతాదని.. ప్రధాని మోదీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా రాష్ట్ర బడ్జెట్‌లో రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఇప్పటికే దాదాపు రూ.49 వేల కోట్ల విలువ కలిగిన నిర్మాణ పనులకు సీఆర్డీఏ పది కంపెనీలకు టెండర్లు కేటాయించింది.

నిర్మాణాలపైనే దృష్టి..

రెండవ విడత ల్యాండు పూలింగ్ విషయంపై హడావుడి వద్దని సీఎం చంద్రబాబు నాయుడు సీఆర్డీఏ అధికారులకు ఆదేశాలిచ్చారు. రాజధాని నిర్మాణ పనులు వేగవంతంపై దృష్టి సారించాలని చెప్పినట్టు తెలిసింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ ఎప్పటికప్పుడు రాజధాని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ప్రధాన రహదారులు పూర్తి అయితే రాజధాని అమరావతి అభివృద్ధి 80శాతం జరిగినట్లేనని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని 150 నుంచి 165 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారుల నిర్మాణం జరుగుతోంది. అవసరమైతే ఇంకా పెంచుకోవాలంటే పక్కన స్థలం రిజర్వు చేసి ఉంచారు. ల్యాండు పూలింగ్‌లో రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాలలో 30 శాతం రహదారుల నిర్మాణానికి వాడుతున్నారు. ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి నిర్మాణానికి రోడ్డు వ్యవస్థే కీలకంగా ఉంది. రవాణా వ్యవస్థ సరిగా ఉంటే ఆ నగరం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ప్రపంచంలో కొన్ని మహా నగాలను పరిశీలిస్తే తెలుస్తుంది. సీఎం చంద్రబాబు నాయుడు పలు దేశాలు పర్యటించి రోడ్డు వ్యవస్థను అద్భుతంగా అమరావతిలో రూపొందించారు.



ఎన్ 14 రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం ఏర్పాటు చేస్తున్న కాంక్రీట్ డెక్‌లు

విసిరితే..వికసిస్తాయి!

● విత్తన బంతులతో పర్యావరణ పరిరక్షణ
● విద్యార్థుల్లో ప్రేరణకు విశ్రాంత అధ్యాపకుడి కృషి
● ఇప్పటికే 60 వేల విత్తనాల సేకరణ
● రోటరీక్లబ్‌ల సహకారంతో విత్తన బ్యాంకుల ఆలోచన



విత్తనాలు సేకరిస్తున్న విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, చిలకలూరిపేట)

పర్యావరణ పరిరక్షణ స్పృహ ప్రతి ఒక్కరిలోనూ కలుగుతోంది. ప్రకృతిని కాపాడుకునేందుకు పర్యావరణ ప్రేమికులు విద్యార్థుల్లో ప్రేరణ కల్పిస్తున్నారు. ఇందుకు అనువైన మార్గాల వైపు వారిని నడిపిస్తున్నారు. అందులో ముఖ్యంగా పచ్చదనం పెంపునకు విత్తన బంతుల తయారీ పద్ధతిని వారికి వివరిస్తున్నారు. ప్రత్యేకంగా సంరక్షణ అవసరం లేకుండా ప్రకృతి సిద్ధంగా త్వరగా పెరిగే మొక్కల విత్తనాలను సేకరిస్తున్నారు. వర్షాలు కురిసే ముందుగానే విత్తన బంతులను సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు బాగా కురిసి నేల చల్లబడిన అనంతరం ఈ విత్తన బంతులను కందకాలు, గుట్టలు, కొండలు, సాగుకు పనికిరాని భూముల్లో విసిరేస్తారు. బంతుల్లో ఉన్న విత్తనాలు మట్టిలో కలిసిపోయి మెలకెత్తుతాయి.

సాధారణంగా విత్తనాల సేకరణ..

మన చుట్టూ ఉండే ప్రాంతాల్లోని చెట్ల కింద వాటి విత్తనాలు లభిస్తాయి. పార్కులు, రోడ్ల వెంబడి, మార్కెట్ యార్డులు, విద్యాసంస్థలు, ఖాళీ స్థలాలు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాల్లో చెట్లకిందపడి ఉండే విత్తనాలను ఆసక్తిగల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు సేకరిస్తున్నారు. అనంతరం వాటిని శుభ్రం చేసి ఆరబెట్టి.. ఎర్రమట్టి, వర్మీకంపోస్ట్ కలిపి సిద్ధంగా ఉంచుకుంటారు. ఖాళీ సమయాల్లో విత్తన బం తులను తయారు చేస్తున్నారు. ఒక బంతిలో రెండేసి చొప్పున విత్తనాలను పెట్టి.. అరబెడతారు. వర్షాలు కురిసి వాతావరణం అనుకూలంగా ఉన్న సమయాల్లో ఈ బంతులను నిర్దిష్ట ప్రదేశాల్లో చల్లుతారు. మొక్కలు మొలవని సందర్భాల్లో అవి మట్టిలో కలిసిపోయి బంతుల్లోని ఎరువు భూమిలో కలిసిపోతుంది.

చిలకలూరిపేటలో విశ్రాంత అధ్యాపకుడి కృషి..

చిలకలూరిపేటలోని కొన్ని విద్యా సంస్థల విద్యార్థులు, రోటేరియన్లు, విశ్రాంత అధ్యాపకులు విత్తన బంతుల తయారీకి సంసిద్ధమవుతున్నారు. రోటరీ క్లబ్ సభ్యుడు, విశ్రాంత అధ్యాపకుడు దండా లక్ష్మీనారాయణ స్వతహాగా పర్యావరణ ప్రేమికుడు. విత్తన బంతుల తయారీ కోసం.. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి సమాచారం సేకరించారు. పర్యావరణ ప్రేమికుడు, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ సలహాదారు అంకారావుతో మాట్లాడి మరి కొన్ని విషయాలను తెలుసుకున్నారు. స్థానిక సీఆర్ కాలనీ వాకర్స్, గణపవరం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి విత్తనాల సేకరణ, విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించారు.



దండా లక్ష్మీనారాయణ

రెండు రోజుల క్రితం పట్టణంలోని చైతన్య లిటిల్స్ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు 45 మందితో కలిసి బస్సులో కోటప్పకొండకు వెళ్లి.. చుట్టూ ఉన్న చెట్ల కింద ఉన్న విత్తనాలను సేకరించారు. కొంతకాలంగా వివిధ చోట్ల వేప, తురాయి, రాగి, గానుగ, నేరేడు, నక్కెరు చెట్ల విత్తనాలను సేకరించారు. ఆయన ఇప్పటికే సుమారు 60 వేల విత్తనాలను సేకరించి స్థానిక రోటరీ క్లబ్‌లో ఉంచారు. ఈ వారంలో పలు విద్యాసంస్థల సహకారంతో సుమారు 30 వేల విత్తన బంతులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విద్యార్థులను చైతన్య పరిచి విత్తన బ్యాంకులను నెలకొల్పితే ప్రయోజనం ఉంటుందని, ఇందుకు రోటరీ క్లబ్‌ల సహకారంతో విద్యా సంస్థల్లో ప్రచారం చేసి అవగాహన కల్పించేందుకు.. ఆసక్తిగా ఉన్నట్లు ఆయన తెలిపారు.



విత్తనాల సేకరణకు కోటప్పకొండ వెళ్లిన విద్యార్థులు

రైతులకు చేరువయ్యేనా..!

● తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్
● రైతుల్లో అవగాహన లోపంతో సేవలు అంతంతమాత్రమే
● ఉచితంగా విత్తన, ఎరువు, పురుగుమందు పరీక్షలు
● నాణ్యతను గుర్తిస్తే పంటలను రక్షించుకునే అవకాశం
● మట్టి నమూనా పరీక్షలకు గుంటూరు పంపాల్సిందే



తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో అగ్రిటెస్టింగ్‌ల్యాబ్



ల్యాబ్ ద్వారా పరీక్షించిన విత్తనాలకు వచ్చిన మొలకలు

తెనాలి రూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ప్రధాన భూమిక పోషించేది విత్తన ఎంపిక. విత్తనం మంచిదైతే చీడపీడలు తట్టుకుని పంటలు సమృద్ధిగా పండటంతో పాటు మంచి దిగుబడి వస్తుంది. ఆరుగాలం శ్రమించిన రైతుకు తగిన ఫలితం దక్కుతుంది. విత్తన ఎంపికలో అధిక శాతం రైతులు విత్తన డీలర్లనే నమ్ముతారు. వారు చెప్పిన మాటలు విని..మంచి దిగుబడి వస్తాయన్న ఆశతో విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. వాస్తవానికి భూమిని అనుసరించి దానికి అనువైన విత్తనాన్నే ఎంపిక చేసుకోవాలి. కొందరు డీలర్లు ఈ విషయాన్ని విస్మరించి, తక్కువ ధరలకు కొనుగోలు చేసిన నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగడుతుంటారు. ధర తక్కువని రైతులు కూడా రసీదులు పొందకుండా కల్తీ, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోతుంటారు.

అగ్రి ల్యాబ్‌లతో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట

వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అగ్రి ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందు, ఎరువులను గుర్తించి.. రైతును నష్టపోకుండా చేయడమే లక్ష్యంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఈ ల్యాబ్‌లలో పరీక్షించి వాటి నాణ్యతను తేలుస్తారు. ఇందులో భాగంగా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పూర్తి ఉచితం గానే పరీక్షలు చేసి నాణ్యతను కేవలం 15 రోజుల్లోనే సిబ్బంది రైతులకు వెల్లడిస్తారు. సాగుకు ముందే రైతులు వారు ఎంపిక

చే సు

కున్న విత్త

నాల్లో కేజీ

వంతున శాంపిల్ తీసుకుని, ల్యాబ్ సిబ్బందిని సంప్రదించాలి. ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబరు చెబితే పూర్తి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మొలక శాతం చెబుతారు. ఎరువులు, పురుగు మందుల వాడే విషయంలో కూడా తప్పనిసరిగా ల్యాబ్ సేవలు సద్వినియోగం చేసుకుంటే అన్నదాతలు కల్తీలకు ఆస్కారం లేకుండా మంచి దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

అవగాహన పెంచాలి

అగ్రి ల్యాబ్ ప్రారంభించిన నాటి నుంచి వీటి సేవలు పొందేవారు నామ మాత్రం గానే ఉన్నారు. ఖరీఫ్,

ం బీ

సీజ

న్లలో వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలను రైతులు సాగుచేస్తుంటారు. సాగుకు ముందు వ్యవసాయశాఖ, ఇతర శాఖల అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి, విత్తన పరీక్షలపై అవగాహన కల్పించడంలో ఆశించినంత ఫలితాలు సాధించలేకపోయారన్న ఆరోపణలున్నాయి.

భూసార పరీక్షలు అందుబాటులో లేవు

సాగు చేపట్టే ముందు.. భూసారం ప్రతి ఒక్క రైతు తెలుసుకోవాలి. సాగు ప్రారంభంలోనే మట్టి పరీక్షలు జరిపి, ఫలితాల ఆధారంగా పోషక లోపాలు ఉంటే నివారణ చర్యలు తీసుకోవచ్చు. విత్తనం మంచిది ఎంచుకున్నా భూమిలో పోషకలోపాలు ఉంటే సకాలంలో ఎదుగుదల లేక దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుంది. తెనాలి నియోజకవర్గంలో మట్టి పరీక్షకంటూ ప్రత్యేక కేంద్రాలు లేవు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది.. పేర్లు నమోదు చేసుకున్న రైతుల వద్దకు వెళ్లి.. వారి భూముల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. వాటిని గుంటూరు పంపి ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఇందుకు సమయం కూడా ఎక్కువగా ఉండటంతో సకాలంలో లోపాలు గుర్తించే అవకాశం లేకుంది. దీంతో రైతులు ఈ పరీక్షలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. జింకు లోపం ఉన్న భూముల్లో పంటలు ఎదుగుదల తగ్గి రైతాంగానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి. మట్టి పరీక్షలపై ప్రభుత్వం దృష్టిపెట్టి ఈ సౌకర్యాన్ని అగ్రి ల్యాబ్ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఏడీఏల నిరీక్షణ

● పోస్టింగ్ కోసం నలుగురు ఎదురు చూపులు
● 40 రోజులు దాటినా అధికారుల కటాక్షం కరువే

గుంటూరు సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న నలుగురు ఏడీఏ(అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)ల భవిష్యత్తు ఏమిటో ఎవరికీ అంతు పట్టకుండా ఉంది. బదిలీల ప్రక్రియ అధికారికంగా ముగిసి 40 రోజులు దాటినా ఈ నలుగురు ఏడీఏ లకు ఇంకా పోస్టింగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఫలితంగా నలుగురు అధికారులు త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారు. వినుకొండలో పనిచేస్తున్న బోయపాటి రవిబాబు మొన్నటి బదిలీల్లో సత్తెనపల్లి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు సత్తెనపల్లి వస్తుందన్న ఆశతో ఉండగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ఆపేశారు. ఆయన అప్పటికే పనిచేస్తున్న వినుకొండకు మాత్రం రవి కుమార్‌ను ఏడీఏగా నియమించడంతో బోయపాటి రవిబాబు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరో ఏడీఏ మస్తానమ్మ విషయంలో కూడా అదే జరిగింది. ఆమె నరసరావుపేటలో పనిచేస్తున్నారు. ఆమె స్థానంలో కేవీ శ్రీనివాసరావును నియమించారు. మస్తానమ్మకు మరో చోట పోస్టింగ్ వేసి రద్దు చేశారు. ప్రస్తుతం మస్తానమ్మ నరసరావుపేట జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. క్రోసూరు ఏడీఏ వి.హనుమంతురావు వేరే చోటికి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు కూడా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో పాత స్థానంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఉన్న రమాదేవిని బాపట్ల రైతు శిక్షణా కేంద్రంలో తొలత నియమించారు. ఆ తర్వాత ఆ పోస్టింగ్ రద్దు చేశారు. ఇలా ఎందుకు పోస్టింగ్‌లు ఇచ్చారో.. ఎందుకు రద్దు చేశారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి వ్యవసాయ శాఖలో నెలకొంది.

సత్తెనపల్లిలో షాడో ఏడీఏ?

సత్తెనపల్లి ఏడీఏ నియామకం విషయంలో గత కొన్ని సంవత్సరాల నుంచి పెద్ద హై డ్రామా నడుస్తోంది. అక్కడకు ఎవరి నైనా నియమించినా రాకుండా అడ్డుకునే పరిస్థితి నెలకొంది. చివరికి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు ఇచ్చినా కూడా ఆ ఏడీఏ ను అక్కడ జాయిన్ కాకుండా అడ్డుకోవడం జరిగింది. ఆ స్థానంలో ఒక ఏట ఇంచార్జి బాధ్యతలు నిర్వహించడం వ్యవసాయ శాఖ లో అప్పటికీ ఇప్పటికీ చర్చనీయాంశమే. ప్రస్తుతం జరిగిన బదిలీ లలో మొదట సత్తెనపల్లి కి ఒక ఏడీఏ ను నియమించారు. తదుపరి ఇచ్చిన సవరణ ఉత్తర్వుల్లో మాత్రం ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. అక్కడ గతం లో మాదిరిగా ఎవరినైనా ఇంచార్జి గా నియమిస్తారా అన్న చర్చ జరుగుతుంది.

నాటి పాపం.. విద్యార్థులకు శాపం

● పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణంలో వైసీపీ జిమ్మిక్కులు..
● ఎమ్మెల్యే యరపతినేని పరిశీలనలో అసలు నిజం..
● మరో రెండున్నరేళ్ల వరకు పనులు కొనసాగే అవకాశం..
● ఈ ఏడాది కళాశాలలో అడ్మిషన్లు దాదాపుగా లేనట్లే..

పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు ఇస్తూ రాష్ట్రంలో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మెడికల్ కళాశాల భవనాలను మంజూరు చేశారు. పిడుగురాళ్లలో 2021 మేలో ఆనాటి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాతో కలిపి మెడికల్ కళాశాల, హాస్పిటల్ భవనాలను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు మొదట్లోనే మందగించి ఆరు నెలలపాటు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఆ తరువాత కాస్త పనులు పుంజుకున్నా మూడేళ్ల వరకు నిదానంగా కొనసా



మెడికల్ కళాశాల భవనాలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు (ఫైల్‌ఫొటో)

గుతూ వచ్చాయి. అనుకున్న గడువులోగా పని పూర్తికాక పోవడంతో.. మరికొంత గడువు కావాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం కోరింది. గత ఎన్నికల నాటికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.500 కోట్లలో సుమారు రూ.250 కోట్లనే ఖర్చు చేసిందే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన వాటిలో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఫలితంగా గతేడాది మార్చి నాటికి మొత్తం పనుల్లో ఆసుపత్రి భవనాలు 70 శాతం, వైద్య కళాశాల భవనాలు 50 శాతం, విద్యార్థుల వసతి గృహాలు 40 శాతం కలిపి మొత్తంలో సుమారు 40 శాతం ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేశారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు మాత్రం 80 నుంచి 90 శాతం పనులు పూర్తిచేశామని గొప్పలు చెప్పుకుంటూ ఎన్నికల ముందు ఓ బ్లాక్‌కు రంగులు వేసి, మెడికల్ కళాశాలను ప్రారంభించినట్లు శిలాఫలకం వేయించారు.

యరపతినేని పర్యటనతో

కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కళాశాల పనులు ఎంతవరకు పూర్తయ్యాయని తెలుసుకునేందుకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని గత నెల చివరి వారంలో మెడికల్ కళాశాల భవనాలను సందర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 10శాతం పనులు పూర్తయ్యాయని, మొత్తం భవనాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మరో రెండున్నర సంవత్సరాలు పట్టే అవకాశం ఉంటుందని మెడికల్‌కళాశాల నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాదికి అడ్మిషన్లు లేనట్లే..

కేంద్ర ప్రాయోజిత పథకం కింద కళాశాల ఏర్పాటుకు నిధులు మంజూరైనా వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు వీలుగా పనులు పూర్తి కాలేదు. ఈ ఏడాది అడ్మిషన్లు పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జరగాలంటే నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు నవంబరు నాటికి దరఖాస్తుచేయాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టు తరగతి గదులు, ఆసుపత్రిలో సౌకర్యాలు కూడా పూర్తి కావాల్సి ఉంది. వైసీపీ నేతలు 80 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లకు ఢోకా లేదని గొప్ప ప్రకటన ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. ఆనాటి పాలకుల పాపం, నిర్లక్ష్యం ఈ ఏడాదిలో అడ్మిషన్లు జరిగేందుకు వీలులేకుండా పోయింది.

మూసివేత దిశగా మాచవరం రైల్వే స్టేషన్

● స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పాటు
● కేవలం ఏడు ప్యాసింజర్ రైళ్లే ఆగేది
● సౌకర్యాలు లేక నిరుపయోగంగా స్టేషన్
● అవరోధాలు అధిగమించేనా?



మాచవరం రైల్వే స్టేషన్ భవనం

పొన్నూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ అవరోధాలను అధిగమించలేకపోతోంది. ఈ రైల్వే స్టేషన్ స్వాతంత్రానికి పూర్వమే ఏర్పడింది. అనేక దశాబ్దాల పాటు ఎంతో మందికి ప్రయాణ సౌకర్యం కల్పించిన మాచవరం రైల్వే స్టేషన్ క్రమేణ మూసివేత దిశగా సాగుతోంది. రైలు సర్వీసులు తగ్గిపోవడం, ప్యాసింజర్ రైళ్లకు ఆదరణ తగ్గిపోవడం, సమీపంలో నిడుబ్రోలు, బాపట్ల స్టేషన్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ సౌకర్యం ఉండటంతో ఈ స్టేషన్‌కు ప్రయాణికుల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. ఆదాయంలేని స్టేషన్లపై రైల్వే శాఖ శీతకన్ను వేయడంతో స్టేషన్ ఆలనా పాలన చూసేవారు కరువయ్యారు. దీంతో ఈ స్టేషన్లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రయాణికుల సంఖ్య రోజుకు 100లోపే ఉండటంతో టికెట్ బుకింగ్ కార్యాలయంలో సైతం రైల్వేశాఖ అవుట్సోర్సింగ్‌కు అప్పగించి చేతులు దులుపుకుంది.

ఏడు సర్వీసులతో సరి...

గతంలో విజయవాడ - చెన్నై ప్రధాన రైలు మార్గంలో ఉన్న మాచవరం రైల్వే స్టేషన్‌లో ఈ మార్గం నుంచి ప్రయాణించే ప్రతి ప్యాసింజర్ రైలు ఆగేది. ప్యాసింజర్ రైళ్లన్నీ ఈ స్టేషన్లో ఆగటంతో పొన్నూరు, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం వంటి గ్రామీణ మండలాలలో ఉన్న పలు గ్రామాల ప్రజలు ఈ స్టేషన్ ద్వారా రాకపోకలకు సాగించేవారు. విజయవాడ, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి వంటి సుదూర ప్రాంతాలకు కూడా రైలు సౌకర్యం ఉండడంతో ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగించుకునేవారు. క్రమేపీ రైల్వే శాఖ ప్యాసింజర్ రైళ్లను తగ్గించివేస్తుండటంతో ప్రయాణికులు తగ్గారు. ప్యాసింజర్ రైళ్లు లేకపోవడం ఈ స్టేషన్లో హాల్టుల సౌకర్యం లేకపోవడంతో స్టేషన్ వైపు ప్రయాణికులు రావడం తగ్గిపోయింది. అంతే కాకుండా సమీపంలో ఉన్న నిడుబ్రోలు, బాపట్ల రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టులు ఉండటంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఆ స్టేషన్లకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లడం ప్రారంభించారు. మాచవరం రైల్వే స్టేషన్లో కేవలం విజయవాడ, ఒంగోలు, గూడూరు ప్రాంతాల నడుమ రోజు వారి ప్రయాణించే ప్యాసింజర్ రైళ్ల మాత్రమే రోజు ఆగుతున్నాయి. గ్రామాల నుంచి ఈ ప్రాంతాలకు రోజువారి పనులపై వెళ్లేవారు, షటిల్ సర్వీసులు చేసే ఉద్యోగులు మాత్రమే ఈ ప్యాసింజర్ రైళ్లను వినియోగించుకుంటున్నారు. ఈ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లకు హాల్టు సౌకర్యం మాచవరం స్టేషన్లో కల్పిస్తే ప్రయాణికుల సంఖ్య పెరిగి ఆదాయం పెరుగుతుందని పలు గ్రామాల వాసులు రైల్వే శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.



స్టేషన్ లెవెల్‌లో ఉన్న ప్లాట్ ఫామ్

సమస్యల తిష్ట

మాచవరం రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. స్టేషన్ ఆదాయం తగ్గిపోవడంతో రైల్వే శాఖ ఈ స్టేషన్ వైపు దృష్టి సారించడంలేదు. దీంతో స్టేషనుకు వెళ్లే ప్రధాన మార్గం కూడా మట్టిరోడ్డుగా మారిపోయి స్టేషన్‌కు వెళ్లే మార్గమంతా పిచ్చిచెట్లు మొలిచి ఈ మార్గం చిట్టడవిని తలపిస్తోంది. స్టేషన్లో ఆలనా పాలన లేకపోవడంతో ప్లాట్‌ఫాంపై పిచ్చి మొక్కలు మొలిచాయి. ప్లాట్‌ఫాం కూడా లోలెవెల్‌లో ఉండడంతో ప్రయాణికులు రైలు ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రైల్వే శాఖ రెండో ప్లాట్ ఫామ్ ఎత్తు పెంచినప్పటికి ఆ వైపు వెళ్లడానికి నిర్మించిన బ్రిడ్జి కూడా సరైన మార్గంలేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్టేషన్లో తాగునీరు లేకపోవడం, ప్రయాణికులు వేచి ఉండే షెడ్లు ఏర్పాటు చేయకపోవడం వంటి సమస్యలు ప్రయాణికుల రాకపోకలను తగ్గిస్తున్నాయి. అంతేకాకుండా రాత్రివేళ వీధి దీపాలు లేకపోవడంతో స్టేషన్ ప్రాంతం నిర్మానుష్యంగా మారిపోతోంది. దీంతో కొందరు స్టేషన్ వేదికగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రైల్వేశాఖ అవరోధాలు అన్నింటిని అధిగమించి స్టేషనుకు పునర్వైభవం లభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ మాచవరం రైల్వే స్టేషన్ కనుమరుగైపోయే ప్రమాదం ఉందని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న స్టేషన్ మార్గం

అవీ..ఇవీ..

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వినోద్‌బాబు

పంగులూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వినోద్‌బాబు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నతనం నుంచే ఒక లక్ష్యంతో విద్యార్థులు ముందుకు పోవాలన్నారు. సోషల్ మీడియాను దరిచేరనీయవద్దని సూచించారు. శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో అవసరమైన సాయం పొందాలని కోరారు. పరిచయంలేని వ్యక్తుల వాహనాలపై ప్రయాణం చేయవద్దని, కొత్తవ్యక్తులు ఇచ్చే పదార్థాలు దరిచేరనీయరాదని సూచించారు. హెచ్ఎం గిరిజ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో శక్తిటీం ఎస్ఐ హరిబాబు, సిబ్బంది సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు : మత్తు పదార్థాలకు బానిసలై యువత జీవితాన్ని వృథా చేసుకోవద్దని పర్చూరు సబ్‌ఇన్‌స్పెక్టర్ జీవీ.చౌదరి అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం స్థానిక బిఎఆర్అండ్ టీపి జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. చెడు అవాట్లకు దూరంగా ఉండాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థులపైనే ఆధారపడి ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో పవన్ గోపీకృష్ణ ప్రతిభ



గోపీకృష్ణకు ప్రశంసాపత్రం అందిస్తున్న డైట్ సీనియర్ అధ్యాపకులు సర్దార్ పాపారాయుడు

పంగులూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మైనంపాడు డైట్ కళాశాల లో నిర్వహించిన వ్యాస రచన పోటీలో కొండమంజులూరు విద్యార్థి పవన్ గోపీకృష్ణ ప్రతిభ చాటాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన పవన్ గోపీకృష్ణకు కళాశాల అధ్యాపకులు డాక్టర్ సర్దార్ పాపారాయుడు మంగళవారం ప్రశంసాపత్రం అందించి అభినందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వర్క్‌బుక్, నోట్‌బుక్‌లను పరిశీలించి ప్రగతిని అంచనావేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం అనిత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

● అవస్థలు పడుతున్న బుర్లవారిపాలెం వాసులు



అధ్వానంగా ఉన్న బుర్లవారిపాలెం రహదారి

బుర్లవారిపాలెం (చీరాల), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొన్నిచోట్ల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బుర్లవారిపాలేనికి చెందిన ప్రజలు నిత్యం అన్నిరకాల పనుల నిత్యం చీరాల పట్టణానికి రావాల్సిందే. ఈక్రమంలో జాతీయ రహదారి నుంచి అంతర్గత ప్రధాన రహదారి గుంతలు పడి దారుణంగా ఉంది. ఆ పరిసరాల్లో విద్యుత్ సౌకర్యాలు కూడా లేవు. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే నీళ్లతో నిండి మార్గం అగమ్య గోచరంగా ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారంచాలని ప్రజలు కోరుతున్నారు. రాకపోకలు సాగించేందుకు నానా యాతన పడుతున్నారు.

సీఆర్‌పీ మోషే కుటుంబానికి ఆర్థికసాయం



మోషే కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఈవో

పంగులూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్‌పీ మట్టకొయ్య మోషే కుటుంబానికి మండల ఉపాధ్యాయులు రూ.1.15 లక్షలు ఆర్థికసాయం చేశారు. మండలంలోని రేణంగివరం గ్రామా నికి చెందిన మట్టకొయ్య మోషే ఈ నెల 8న అర్ధరాత్రి సమయంలో వెంకటాపురం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం రేణంగివరంలో మోషే కుటుంబసభ్యులను పరామర్శించిన ఎంఈవో నాగభూషణం, మండల ఉపాధ్యాయులు తాము సేకరించిన నగదు మొత్తాన్ని భార్య నాగేశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంకణాల శ్రీనివాసరావు, రహంతుల్లా, తన్నీరు వెంకటరావు, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, రవిచంద్ర, బత్తుల సుబ్బారావు, పాలపర్తి ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

మార్టూరు, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించేందుకు, రైతులకు ఘన జీవామృతం, బీజామృతం తయారీపై డెమో కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మండలంలోని బొల్లాపల్లి, తాటివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం హాస్సేన్, అడిషనల్ డీపీఎం మోహన్ విచ్చేశారు. అనంతరం కోలలపూడిలో సర్పంచ్ ఎం. సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఎన్‌పీఎం దుకాణాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ పడవల గణనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా కోత ఉంటుందన్నారు.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అధికారులకు మంత్రి రవికుమార్ ఆదేశం

తమ్మవరంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న రవికుమార్

మేదరమెట్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా బర్లీ పొగాకు కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం కొరిశపాడు మండలంలోని తమ్మవరంలో ఏర్పాటు చేసిన బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతు బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు అధైర్య పడవద్దన్నారు. చివరి పొగాకును కొనుగోలు చేసి రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ప్రతి రోజు రైతుల నుంచి 500 చెక్కుల వరకు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పొగాకు కొనుగోలు సాగు చేసుకోవా లన్నారు. పొగాకు చెక్కులు కట్టే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ ర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏవో రామ్‌మోహన్‌రెడ్డి, పలు గ్రామాల టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : అర్హులైన పేదలం దరి కీ, సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సంత మాగులూరు మండలం, వెల్లలచెరువు గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.30 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్స్‌ను ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో బాల, బాలికలు దూర భారంతో చదువు మానివేయకుండా దశల వారీగా 10 వేల సైకిళ్లు అందిస్తానని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలో ఇచ్చిన హామీ మేరకు వెల్లలచెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో 137 సైకిళ్లను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికి తిరుగుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సజ్జా చంద్రమౌళి

ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య



చంద్రమౌళి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, నిరంతర శ్రామికునిగా సజ్జా చంద్రమౌళి ప్రజల్లో అత్యున్నత స్థానాన్ని దక్కించుకున్నారని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మంగళవారం పట్టణంలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే ప్రజావైద్యులు డా.సజ్జా చంద్రమౌళి 98వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పట్టణంలోని గడియారస్తంభం కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రగడ కోటయ్య తరువాత చేనేత రంగానికి జీవం పోసిన మహోన్నత వ్యక్తి సజ్జా చంద్రమౌళి అని కొనియాడారు. చీరాలలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా అరుదైన సేవలు అందించినట్లు వివరించారు. అంతేకాకుండా వృత్తిరీత్యా వైద్య రంగమైన ప్రవృత్తి రీత్యా రాజకీయారంగేట్రం చేసి వ్యక్తి గత జీవితాన్ని సైతం ప్రక్కన పెట్టి ప్రజాసేవకే అంకితమైనట్లు చెప్పారు. ఆయన అడుగు జాడ ల్లోనే వారి కుటుంబీకులు డా.సజ్జా రవీంద్ర, హ్యాండ్ లూ మ్ చైర్మన్ సజ్జా హేమలత ప్రజాసేవకై పాటుపడుతుండడం అభినందనీయమన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో చంద్రమౌళికి కో-ఆప్‌టెక్స్ చైర్మన్‌గా పదవి కల్పిస్తే, అదేవిధానంలో నేడు వారి కోడలు హేమలత మరో నామినేటెడ్ పదవిలో కొనసాగిస్తున్న ఘనత టీడీపీకే దక్కిందని చెప్పారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు టీడీపీ ప్రజలకు అండగా ఉండే పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు, చంద్రమౌళి అభిమానులు పాల్గొన్నారు.

రోజుకు వెయ్యి పొగాకు బేళ్లు కొనుగోలు చేయాలి

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్

పంగులూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంగులూరులోని నల్లబర్లీ కొనుగోలు కేంద్రంలో రోజుకు కనీసం వెయ్యి పొగాకు బేళ్ల కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య డిమాండ్ చేశారు. పంగులూరులో మంగళవారం పొగాకు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు రైతులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో నామ మాత్రపు కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. రైతులు తాము పండించిన పొగాకు అమ్ముకునేందుకు నెలల తరబడి ఎదురు చూస్తున్నారన్నారు. పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన సందర్భంలో రోజుకు 300-500 బేళ్ల పొగాకు కొనుగోలు చేస్తామని హామీ యిచ్చారన్నారు. కొన్న మూడు రోజులలో డబ్బు చెల్లిస్తామని హామీ యిచ్చారని కృష్ణయ్య గుర్తు చేశారు. కానీ ఆచరణలో పరిస్థి తులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. రైతు లు ఐదు నెలలుగా తాము పండించిన పొగాకు మండెల రూపంలో నిల్వ ఉంచారని, ఆ పొగాకు ఈ పాటికే పనికి రాకుండా ఉండే దశకు చేరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు సాంద్రత పెంచి త్వరితగతిన కొనుగోలు చేసి రైతును ఆదుకో వాలని కోరారు. రైతుసంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లా డుతూ ప్రభుత్వం, అధికారులు వ్యాపారంలా చూస్తున్నారని, రైతును ఆదుకునేలా భావిచడం లేదని విమర్శించారు. నాణ్యత పేరుతో పొగాకు బేళ్లను వెనుకకు పంపడం సరైన విధానం కాదన్నారు. లోపాలను సవరించి ప్రభుత్వం వేగవంతంగా పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామారావు, వినోద్‌బాబు, ప్రభాకర్,రాజయ్య, రమేష్, నతానియేల్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

బాపట్ల డివిజన్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి



మాట్లాడుతున్న డివిజన్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి

మార్టూరు, జూలై15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల ప్రతిఫలాలు వేగంగా ప్రజలకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని బాపట్ల డివిజన్ అభివృద్ధి అధికారి సీహెచ్ విజయలక్ష్మి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బంగారు కుటుంబాలు, సూర్యఘర్ తదితర అంశాలకు సంబందించి, మంగళవారం మార్టూరులోని ఎంపీడీవో కార్యాలయంలో మార్టూరు, యద్దనపూడి, పర్చూరు మండలాలకు చెందిన ఎంపీడీవోలతో పాటు వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులతో డీడీవో విజయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బంగారు కుటుంబాలు ఎంపికపై ఆయా మండలాల ఎంపీడీవోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్టూరు మండలంలో బంగారు కుటుంబాలకు 2200 కుటుంబాలను ఎంపికచేశామని, వారికి మార్గదర్శకులుగా 186 మందిని ఎంపికచేశామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా పర్చూరు, యద్దనపూడి మండలాల పరిస్థితిని కూడా ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక సూర్యఘర్ లో మండలాలలో ఎంతమంది నమోదు చేసుకున్నారు, ఇంకా ఎంతమంది నమోదు చేసుకోగలరనే విషయంపై ఆమె అధికారులతో మాట్లాడారు. మండలానికి 1500 లక్ష్యంగా చేసుకున్నామన్నారు. అందుకు సంబంధించి ప్రణాళికలను తయారుచేసి ఉన్నత అధికారులకు పంపించాలని వారిని కోరారు. కార్యక్రమంలో పలు మండలాల ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

స్వల్ప వివాదం నేపథ్యంలో కత్తులతో దాడి



వివరాలు సేకరిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప వివాదం నేపథ్యంలో ఇరువురు వ్యక్తులు కత్తులతో దాడి చేసుకున్న ఘటన పట్టణంలోని ముంతావారి కూడలిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే స్థానిక వైకుంఠపురం జాలమ్మగుడి సమీపంలోని కావాటి కృష్ణవేణి, మరో ఇద్దరు మహిళలతో ఆటోలో పట్టణంలోని ఓ బ్యాంకుకు వెళుతుంది. అదే సమయంలో గంజిపాలెంకు చెందిన సుబ్రహ్మణ్యం మరొక వ్యక్తితో స్కూటీపై వెళుతుండగా ఇరువురు వాహ నాలు ముంతావారి సెంటర్ వద్ద స్వల్పంగా ఢీకొన్నాయి. అనంతరం ఈ వివాదం తారాస్థాయికి చేరింది. సుబ్రహ్మణ్యం మరో ఇద్దరు వ్యక్తులను ఘటనా స్థలానికి పిలిపించాడు. దీంతో ఘర్షణలకు దిగడంతో కృష్ణవేణి వీపు, ఎడమ కంటిపై సుబ్రహ్మణ్యం సహచరులు కత్తితో దాడి చేశాడు. కృష్ణవేణి, ఆటోలో వారు సుబ్రహ్మణ్యంపై కత్తితో దాడి చేశారు. ఇరువురు రక్త గాయాలతో చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందుతుండగా, సిఐ సుబ్బారావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే రెండు వర్గాలకు సంబంధించి గతంలో ఎటువంటి వివాదాలు లేకపోగా, ఇరువురు పాతనేర చరిత్ర కలిగిన వారు కావడం విశేషం.

మద్దతు.. మమ

● దిగుబడులు కొండంత ● మార్క్‌ఫెడ్ సేకరించింది గోరంత

● బహిరంగ మార్కెట్ వైపే రైతుల మొగ్గు

● మొక్కజొన్న కొనుగోళ్ల ఊసేలేదు

వచ్చాయి. ఈ పంట మార్క్‌ఫెడ్ జాబితాలో ఉంది కూడా. కానీ మద్దతుధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో మొత్తం దిగుబడులను రైతులు దళారులకే అమ్ముకోవాల్సి వచ్చింది

వైఫల్యాలపై దృష్టి పెట్టని ప్రభుత్వం

పంటల సేకరణ మరీ ఇంతలా తీసికట్టుగా ఉండడానికి అనేక బాలారిష్టాలు కారణంగా ఉన్నాయి. ముఖ్యంగా దిగుబడులు అన్నదతాల చేతికొచ్చిన మూడు వారాల తర్వాత గానీ మార్క్‌ఫెడ్ కేంద్రాలు తెరవలేదు. దీనికి తోడు మార్క్‌ఫెడ్ వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చడంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాల ఊసే దాదాపుగా మరిచారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం వైఫల్యం కూడా కారణంగా నిలిచింది. నిబంధనల చట్రం కూడా సేకరణకు ప్రతిబంధకంగా మారింది.

బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువ....ఉత్తమాటే...

బహిరంగ మార్కెట్‌లో ఆయా పంటల ధరలు మద్దతు ధరకు కన్నా ఎక్కువగా ఉండడం వల్లనే సేకరణ తక్కువగా ఉందనే వాదనను యంత్రాంగం చేస్తోంది. కానీ దిగుబడుల సమయంలో క్షేత్రస్థాయిలో ఉన్న ధరలను గమనించినట్లయితే ప్రతి పంట రేటు కూడా మద్దతుధర కన్నా బహిరంగ మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.800 వరకు తక్కువగానే ఉంది.

నగదు జమ విషయంలోనూ జాప్యమే

పంటల కొనుగోళ్లకు సంబంధించిన నగదును 48 గంటల్లోనే జమ చేస్తామనే పాలకుల మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. మార్క్‌ఫెడ్ సేకరణ జరిపిన పంటల విషయంలో కూడా కనీసం నాలుగు వారాలు మొదలుకుని నెలన్నర వరకు సమయం డబ్బులు జమ కావడానికి పట్టినట్లు సమాచారం.

త్రిమెన్‌కమిటీ చైర్మన్ల ఎంపిక

పర్చూరు జూలై15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో త్రిమెన్‌కమిటీల ఎంపిక పూర్తయ్యింది. బొల్లాపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొట్టిపాటి నరసింహారావు, డైరెక్టర్లగా తాటి అంజనేయలు, ఇందుర్తి ఖాజారావు. ద్రోణాదులకు ముప్పరాజు ఆంజనేయులు, డైరెక్టర్లగా గంజి వీరాంజనేయులు, గోగుమళ్ళ జేమ్స్, రమణాయపాలెంకు చైర్మన్‌గా పాలేటి కోటేశ్వరరావు, కోలా సాంబయ్య, షేక్.అబూబాకర్, అమ్మినేని వెంకటేశ్వర్లు, డైరెక్టర్లగా సూరిశెట్టి అంకమ్మరాజు, పసుపులేటి రవిచంద్రబాబు, భీమవరానికి రాయపాటి వెంకటరావు, డైరెక్టర్లగా మందాలపు శేషయ్య, చలిచం గోపాలస్వామి, ఇంకొల్లు పీఏసీయస్‌కు కరి శ్రీనివాసరావు, డైరెక్టర్లగా గోరంట్ల నాగేశ్వరావు, మన్నెం ఏసుబాబు, కొణికి బోడెంపూడి సుబ్బారావు, డైరెక్టర్లుగా కంచనపల్లి సుబ్బారావు, పావులూరి రామారావు, పావులూరుకు నారిశెట్టి రాంబాబు, డైరెక్టర్లగా గంజి నాగేశ్వరావు, కామేపల్లి తాతారావు, సంతరావూరు చైర్మన్‌గా యార్లగడ్డ లక్ష్మీ, డైరెక్టర్లగా మైలా ప్రసాద్, బండారు అంజనేయులు, ఆదిపూడి పీఏసీయస్ చైర్మన్‌గా దండా శ్రీనివాసరావు, డైరెక్టర్లగా నాయుడువారిపాలెం చైర్మన్‌గా జరుగుల శ్రీనివాసరావు, డైరెక్టర్లగా పోతిన వెంకటనారాయణ, పేర్ని చెంచయ్య, అన్నంబొట్లవారిపాలెం చైర్మన్ అప్పలనేని నరేంద్రబాబు, బోడవాడ త్రేలప్రోలు శ్రీనివాసరావు, నాగులపాలెం అడ్డగడ్డ సుబ్బారాయుడు, నూతలపాడు విన్నకోట సతీష్, పర్చూరు కొల్లా చంద్రం, పోతుకట్ల ఎర్రావాసుబాబు నియమితులయ్యారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

● రోటరీ జిల్లా సహాయ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు



బాలికల పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని, విద్యతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రీటరీ జిల్లా సహాయ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పర్చూరులోని ఏఎన్‌వియస్ బాలికల ఉన్నత పాఠశాలకు నాగబౌరు శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో సమకూర్చిన రూ.15 వేల విలువ చేసే క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అవసమైన మౌలిక వసతలు కల్పనలో రోటరీ కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కెయస్ఆర్‌కె ప్రసాద్, కోటా శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, కొల్లా సుబ్బారావు, కాసా అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు యస్.అవని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



ఇంకొల్లు పీహెచ్‌సీలో అందజేస్తున్న అక్సిజన్ కాన్సెంట్రేటర్లు

ఇంకొల్లు,జూలై 15,(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఆర్‌సీ) కార్యక్రమంలో భాగంగా మిడివెస్ట్ గ్రానైట్ లిమిటెడ్ సంస్థ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు ఆక్సిజన్ కాన్సెంట్రేటర్లను ఉచితంగా అందజేయడం అభినందనీయమని ఇంకొల్లు ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డా.అంజలీ అన్నారు. బాపట్ల జిల్లాలోని పీహెచ్‌సీ ఏరియా వైద్యశాలకు 59 ఆక్సిజన్ కాన్సెంట్రేటర్లను మంగళవారం ఆ సంస్థ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు అందజేశారు. బాపట్ల, చీరాల, పర్చూరు పరిధిలోని పీహెచ్‌సీలకు 46 యూనిట్లు, సీహెచ్‌సీలకు 16 యూనిట్లు పంపిణీ చేశారు. వీటితో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చునని శ్రీనివాసరావు అన్నారు. దాతలను డా.అంజలి అంభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

ఇంకొల్లు,జూలై 15,(ఆంధ్రజ్యోతి) : పత్తి సాగు చేసే రైతులు విత్తనాలను శుద్ధి చేసుకొని నాటుకుంటే పత్తిలో వచ్చే ఎండుతెగులు నివారించుకోవచ్చని ఏవో మీరమ్మ తెలిపారు. మండలంలోని పావులూరులో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక కిలో పత్తి విత్తనాలకు 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి, 5 గ్రాములు సూడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేయాలన్నారు. ప్రతి పంటపై బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పావులూరు సర్పంచ్ లుదియమ్మ, వ్యవసాయశాఖ సిబ్బంది వినయ్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ పడవల గణనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ ఉదయం 5గంటలకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యద్దనపూడి,(మార్టూరు)జూలై15(ఆంధ్రజ్యోతి):జాతీయరహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలో సూరవరపుపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు మంగళవారం స్టేషన్‌కు సమాచారం అందినట్లు ఎస్ఐ టి రత్నకుమారి తెలిపారు. మృతునికి 35 నుండి 40 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు.మృతుని శరీరంపై క్రీమ్ కలర్ షర్ట్,ప్యాంట్ ఉన్నద న్నారు.అంతకు మించి మృతుని నుండి ఎలాంటి సమాచారం లభించలేదన్నారు.రోడ్డుపై వెళ్లే ఏదైనా వాహనం నుంచి మృతుడు రోడ్డుపై పడి ప్రాణాలు పోగొట్టుకున్నాడా లేదా అని పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని గురించి సమాచారం తెలిసిన వారు స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ రత్నకుమారి తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

మార్టూరు,జూలై15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో అక్రమంగా మద్యం అమ్ముతున్న సరిమెళ్ల దయాకర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, ఆయన వద్ద ఉన్న ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని,కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

రేసులో.. ఆ ఇద్దరు!

● చీరాల మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేడే

(3వ పేజీ తరువాయి...)

మీద నడకగానే ఉండనుంది

అంతా సవ్యంగానే కనిపించినా...

చీరాల రాజకీయం అంచనాలకు అందదనే సంఘటనలు గతంలోనే పలుమార్లు నిరూపితమైంది. తాజాగా చైర్మన్ అవిశ్వాస ఘట్టం కూడా ఎన్నో మలుపులు తీసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీడీపీకి మద్దతుగా ఉన్న 21 మంది కౌన్సిలర్లలో ఒక్కరు తప్ప అందరూ నిన్న మొన్నటి వరకు వైసీపీ గూటి పక్షులే. ఇప్పటికీ 7 గురు కౌన్సిలర్లు వైసీపీలోనే ఉండగా, మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గంగా 5గురు కౌన్సిలర్లు కొనసాగుతున్నారు. జరుగుతున్న పరిణామాలను వీరు నిశితంగా గమనిస్తున్నారు. నేటి చైర్మన్ ఎన్నిక అంకంలో వీరిలో ఎవరైనా పోటీకి ముందుకు వస్తే ఎన్నిక అనివార్యమే. కాకుంటే సంఖ్యాబలంగా టీడీపీకి స్పష్టమైన మెజారిటీ కనిపిస్తుండడంతో ఎన్నిక జరిగినా పీఠం టీడీపీదేననే ధీమాను పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.





శక్తియాప్‌తో మహిళలకు రక్షణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ

మేదరమెట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని సెయింట్ ఆర్నాల్డ్ స్కూల్‌లో నిర్వహించిన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని శక్తియాప్ కరపత్రాన్ని ఆ విష్కరించారు. ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. అనుమానిత వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కొరిశపాడు, మేదరమెట్ల ఎస్ఐలు ఎస్ఐలు హరిబాబు, మహమ్మద్ రఫీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

24 మందికి వినికిడి మిషన్ల అందజేత


వినికిడి మిషన్లు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో గంగాధర్

అద్దంకిటౌన్, జూలై 15 (ఆంధ్ర జ్యోతి): ప్రత్యేక అ వసరాలున్న చిన్నారులకు భవిత కేంద్రం ఒక వరం అని డిప్యూటీ డిఈవో డి.గంగాధరరావు అన్నారు. మంగళవారం భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ద్వారా అందించిన 24 వినికిడి మిషన్లను డిప్యూటీ డీఈవో గంగాధరరావు, ఎంఈవో -2 అనంత శ్రీనివాస రావుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతు 2025-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మండల పరిధిలోని ప్రత్యేక అ వసరాలున్న చిన్నారులకు ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా రూ.5 లక్షల విలువైన ఉపకరణాలను ఉచితంగా అందజేసిందన్నారు. ఉపకరణాలు అందుకున్న విద్యార్థులు చక్కగా చదువుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం కల్పించే ఈ సౌకర్యాలను వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈ ఆర్‌టి ఉపాధ్యాయులు కోంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, చైతన్య బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, ఉపాధ్యాయులు బాబురావు, ధనలక్ష్మీ, వి జయకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల భిక్షాటన


భిక్షాటన చేస్తున్న కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు అ మలు చేయాలని డిమాండ్ చేస్తూ అద్దంకిలోని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళ వారం 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసు కున్న శిబిరంలో, రోడ్లు వెంబడి బిక్షాటన చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. ఈ సమ్మెకు సీఐటీయూ నాయకులు తంగి రాల వెంకటేశ్వర్లు, ఇతర సంఘా ల నాయకులు రావులపల్లి కోటేశ్వ రరావు, తొట వెంకటేశ్వర్లు, టి. రాజు, నాగేశ్వరరావు, మీరావలిలు సంఘీభావం తెలిపారు.

Declaration of Name Consistency

I, **NUNNA RAMAKRISHNA-PARAMAHAMSA**, resident of 3-26, Adusumalli (post), Parchur (mandal), Bapatla(district), Andhra Pradesh - 523169 do hereby declare that my name has been changed from **RAMA KRISHNA.N (Old Name) to NUNNA RAMAKRISHNAPARAMAHAMSA (New Name)** hereinafter, I request all concerned to take note of this.





